SAMAYAM
epaper.samayamdaily.net APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 18 | సంచిక: 329 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 10 ఆగస్టు 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## పిల్లలతో కలిసి ప్రధాని రక్షాబంధన్

సోదరిమణులకు శుభాకాంక్షలు

ఢిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీకి రాఖీ కట్టారు. అనంతరం మోదీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## ఢిల్లీలో కుండపోత వర్షాలు

గోడకూలిన ఘటనలో ఏడురుగు మృతి

శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం

తక్షణమే రంగంలోకి దిగిన ఢిల్లీ అగ్నిమాపక బృందాలు

విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం

వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ

02





## ఆదివాసీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

ఆదివాసీలంటే గుర్తొచ్చేది సహజ నైపుణ్యం, సామర్థ్యం

అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్

టూరిజం క్లస్టర్లుగా అరకు, లంబసింగి, మారేడుమిల్లి

గ్రామీణ ఆవాస్ యోజన కింద ఆదివాసీలకు 54 వేల ఇళ్లు నిర్మిస్తాం

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**పాడేరు :** ఆదివాసీలు అన్ని విధాలా అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, గిరి పుత్రుల్లో మరింత చైతన్యం తీసుకురాగలిగితే అభివృద్ధికి ఢోకా ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టగా దాన్ని తాను కొనసాగిస్తున్నానని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు కల్పించేందుకు గతంలో తాము జీవో నెంబర్ 3 తీసుకొస్తే గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఆ జీవోలు రద్దయ్యాయని, రద్దైన జీవో నంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు చేస్తామన్నారు. అల్లూరి జిల్లా పాడేరు

మిగతా 5లో



## అంతర్జాతీయ స్థాయికి అరకు కాఫీ..

రబ్బరు, కాఫీ సాగు విస్తరణకు అడుగులు

బ్రాండింగ్ బాధ్యతలు స్వీకరించిన టాటా

గిరిజన అభివృద్ధి లక్ష్యంగా ముందడుగు

05

## హైకోర్టు ఆదేశాలకనుగుణంగా స్థానిక ఎన్నికలు

కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం ■ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ఆగస్టు 9:** బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు.

మిగతా 2 లో

## పోలీసుల పక్షపాత వైఖరి

పులివెందులజడ్పీ ఉప ఎన్నికల్లో పోలీసుల తీరుపై నిరసన

ఈసీ కార్యాలయం ఎదుట వైసీపీ ధర్నా



**అమరావతి :** పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు విజయవాడలో ఆందోళనకు దిగారు. పోలీసుల తీరుకు నిరసనగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ప్రభుత్వానికి

మిగతా 5లో



## నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకోను

ఫోన్ ట్యాపింగ్‌లో తండ్రీకొడుకుల హస్తం

కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై అసెంబ్లీలో చర్చ ఎందుకు జరపడం లేదు?

కేసును సీబీఐ ఇస్తే కొల్లిక్కి వస్తుంది

03




## 334 రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు

04

బీహార్ ఓట్ల రివిజన్‌ను సమర్థించుకున్న ఈసీ

## సర్కారు ఆఫీసుల్లో సౌర వెలుగులు

- విద్యుత్ భారం తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు
- 'ఇందిరా సౌర గిరిజన వికాసం'పై వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఆగస్టు 9:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక సౌర విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఆర్థికపరంగా విద్యుత్ బిల్లుల భారం తగ్గించే దిశగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నది. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్‌భూముల్లో 'ఇందిరా సౌర గిరిజన వికాసం' పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి

మిగతా 2 లో





## హైకోర్టు ఆదేశాలకనుగుణంగా
# స్థానిక ఎన్నికలు

**కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం ● మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ఆగస్టు 9:** బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

**ఆర్టీసీలో నోటిఫికేషన్**

**హైదరాబాద్, ఆగస్టు 9:** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు టీజీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్ శివారులోని హకీంపేట్‌లో ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎనిమిది, పదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కాలేజీలో మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో కోర్సులు అందిస్తున్నట్లు తన ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 28వ తేదీలోగా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు మరింత సమాచారం కోసం 9100664452, 6302649844, 040-69400000 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సూచనలు చేసింది. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఏడాది వ్యవధిలో పూర్తయ్యే కోర్సులు. ఇక మెకానిక్ (మోటర్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. వెల్డర్, పెయింటర్ కోర్సులకు ఎనిమిదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు పరీక్షల ఫలితాలు మరో రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. తొలుత ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు. అనంతరం 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే స్టాఫ్ నర్సు పోస్టుల మెరిట్ జాబితా కూడా విడుదల చేసి, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు వైద్య నియామక బోర్డు ఏర్పాట్లు చేస్తుంది.

## 1,50,159 కోట్లకు పెరిగిన భారత
# రక్షణరంగ ఉత్పత్తులు

**అందరి కృషిని ప్రశంసించిన మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** భారతదేశ వార్షిక రక్షణ ఉత్పత్తి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.1,50,590 కోట్లకు పెరిగింది. ఇది 2023-24లో ఉన్న రూ.1.27 లక్షల కోట్లతో పోలిస్తే 18 శాతం వృద్ధిని సూచిస్తుంది. అంతేకాదు, ఈ పెరుగుదల 2019-20 ఆర్థిక సంవత్సరం నుండి చూస్తే, ఏకంగా 90 శాతం వృద్ధిని ప్రతిబింబిస్తుంది. అప్పట్లో దీని విలువ రూ.79,071 కోట్లుగా ఉంది. ఈ మైలురాయిని సాధించడంలో రక్షణ ఉత్పత్తి శాఖ, ఇంకా డీపీఎస్‌యులు, ప్రభుత్వ రంగ తయారీదారులు, ఇంకా ప్రైవేట్ పరిశ్రమలతో సహా అందరి సమిష్టి కృషిని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఇది భారతదేశ రక్షణ పారిశ్రామికరంగ పెరుగుదలకు స్పష్టమైన సూచికగా మంత్రి అభివర్ణించారు. ఢిల్లీలో ఈ మేరకు రక్షణ మంత్రి వివరాలు వెల్లడించారు. మోదీ సర్కారు తీసుకొచ్చిన ఆత్మనిర్భర్ భారత్ కింద రక్షణ తయారీలో స్వయం సమృద్ధిని ఈ పెరుగుదల నొక్కి చెబుతోందని కేంద్ర మంత్రి అన్నారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, భారతదేశ అవసరాలను తీర్చడమే కాకుండా ఎగుమతుల సామర్థ్యాన్ని బలోపేతం చేసే రక్షణ పారిశ్రామిక సముదాయాన్ని సృష్టించడంపై చూపిన ప్రాధాన్యత ఈ సానుకూల ఫలితాలను అందించిందని మంత్రి తెలిపారు. డీపీఎస్‌యులు, ఇతర ఆయుధాలు మొత్తం ఉత్పత్తిలో దాదాపు 77 శాతం వాటాను కలిగి ఉండగా, ప్రైవేట్ రంగం 23 శాతం వాటాను కలిగి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 21 శాతం నుండి 2024-25 ఆర్థిక సంవత్సరంలో 23 శాతానికి పెరిగిన ప్రైవేట్ రంగం వాటా, దేశ రక్షణ పర్యావరణ వ్యవస్థలో తన పాత్రను వెల్లడిచేస్తుంది. గత దశాబ్దంలో విధాన సంస్కరణలు, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం, స్వదేశీ తయారీపై వ్యూహాత్మక ముందుచూపు కారణంగా రక్షణ పరిశ్రమలోని ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాలు రెండూ స్థిరమైన వృద్ధిని ప్రదర్శించాయి.

## ప్రమాదానికి గురైన రక్షణ విమానం




**ముంబై, ఆగస్టు 9:** మహారాష్ట్రలో ప్రమాదం చోటు చేసుకుంది. పూణె జిల్లాలోని బారామతి విమానాశ్రయం సమీపంలో శనివారం ఉదయం ఓ శిక్షణ విమానం ప్రమాదానికి గురైంది. అయితే, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో శిక్షణ విమానం గాల్లో ఉండగా అందులోని టైర్లలో ఒకటి దెబ్బతిన్నట్లు పైలట్ గుర్తించారు. దీంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ల్యాండింగ్ తర్వాత ముందు చక్రం ఊడిపోయింది. దీంతో విమానం ట్యాక్సీవే నుంచి అదుపుతప్పి ఎయిర్‌పోర్ట్ అవతలివైపుకు దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని చెప్పారు. ఈ ప్రమాదం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడ్డట్లు వివరించారు.

# ఢిల్లీలో కుండపోత వర్షాలు

**గోడకూలిన ఘటనలో ఏడురుగు మృతి**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9:** దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. జైత్‌పూర్‌లో శనివారం ఉదయం గోడ కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కొంతమంది శిథిలాల కింద చిక్కుకున్నారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. రంగంలోకి దిగిన పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షాలకు గోడకూలి ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హస్తినలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్టు తెలుస్తోంది. ఢిల్లీలోని హరినగర్ లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మందిని రక్షించారు, తీవ్రంగా గాయపడ్డ నలుగురుని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీగా కురిసిన వర్షం కారణంగా హరి నగర్‌లోని జైత్‌పూర్ ప్రాంతంలో గోడ కూలిపోవడంతో, పాత ఆలయం పక్కనే ఉన్న జగ్గీలలో నివసిస్తున్న వాళ్లు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. భవిష్యత్తులో అలాంటి ఘటనలు జరగకుండా జగ్గీలను ఖాళీ చేయించామని సౌత్ ఈస్ట్ అదనపు డీసీపీ ఐశ్వర్య శర్మ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ అగ్నిమాపక బృందాలు తక్షణమే రంగంలోకి దిగి సహాయక చర్యను ప్రారంభించాయి. మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), అలీ (45), రుబినా (25), డాలీ (25), రుక్సానా (6) హసీనా (7) గా గుర్తించారు. ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయి ఇద్దరు మృతి చెందిన ఘటన జరిగిన పది రోజుల తర్వాత ఈ ప్రమాదం చోటు-చేసుకుంది. ఢిల్లీ ఇవాళ భారీ వర్షాలతో అతలాకుతలమైంది. వర్షాల కారణంగా దేశ రాజధానిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, శనివారం ఉదయం 8.30 గంటల వరకు సప్దర్‌జంగ్‌లోని ఢిల్లీ ప్రాథమిక వాతావరణ కేంద్రంలో 78.7 మి.మీ., ప్రగతి మైదాన్‌లో 100 మి.మీ., లోధి రోడ్‌లో 80 మి.మీ., పూసాలో 69 మి.మీ., పాలంలో 31.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అటు, యమునా నది నీటి మట్టం కూడా ప్రమాదకర స్థాయి 204.50 మీటర్లకు చేరుకుంది. ఓల్డ్ రైల్వే వంతెన దగ్గర ఉదయం 9 గంటలకు నీటి మట్టం 204.40 మీటర్లు ఉంది. దీంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# సర్కారు ఆఫీసుల్లో సౌర వెలుగులు

మొదటి పేజీ తరువాయి

మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ప్రభుత్వ భవనాల వివరాలు, నెలవారీ విద్యుత్ వినియోగం, బిల్లులను వారంలోగా సమర్పించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇతర శాఖ భవనాలపై కూడా సౌర ఫలకాలు అమర్చనున్నట్టు ఉపముఖ్య మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్‌సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, రెడ్‌కో సీఎండీ అనిలా, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.




# ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

**పండుగ తర్వాత చార్జీలు యథాతథం**

**ఆర్టీసీ యాజమాన్యం**




**హైదరాబాద్, ఆగస్టు 9:** రాఖీ పండుగకు చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్టీసీ నిర్వహన కారణంగా కొంత చార్జీలు పెంచినట్టు తెలిపింది. పండుగ తరువాత రేట్లు యథాయథంగా ఉంటాయని వెల్లడించింది. ఈ నెల 11 వరకు స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెంచినట్లు వెల్లడించింది. ఆ తర్వాత చార్జీలు సాధారణంగానే ఉంటాయని పేర్కొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు లేకున్నా బస్సులను వెంటనే తిరిగి తీసుకురావాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల నిమిత్తం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలు పెంచామని వెల్లడించింది. 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్‌ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రూ.1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.' అని తెలిపింది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండుగ ప్రయాణికుల రద్దీ నెలకొంది. సికింద్రాబాద్ జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

## యాంటీ ర్యాగింగ్ వీక్
# పెట్టాల్సిందే

**మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ ఆదేశాలు**

**హైదరాబాద్, ఆగస్టు 9:** దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ఆగస్టు 12 నుంచి ఆగస్టు 18 వరకు యాంటీ ర్యాగింగ్ వీక్‌ను పాటించాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన పరిధిలోని అన్ని మెడికల్ కాలేజీలను కోరుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆగస్టు 12వ తేదీని యాంటీ ర్యాగింగ్ డేగా అన్ని మెడికల్ కాలేజీల్లో సెలబ్రేట్ చేసుకోవాలని పేర్కొంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ నిర్దేశించిన యాంటీ-ర్యాగింగ్ ఫ్రేమ్‌వర్క్ అమలులో భాగంగా దీనిని పాటించాలని తన నోటీసులో పేర్కొంది. ఈ నిబంధనలు తప్పనిసరని స్పష్టం చేసింది. అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఈ నిబంధనలలో పేర్కొన్న పర్యవేక్షణ విధానాలుతో సహా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కూడా పేర్కొంది. యాంటీ-ర్యాగింగ్ వీక్ సందర్భంగా మెడికల్ కాలేజీల్లో పలు కార్యకలాపాలను నిర్వహించాలని యూజీసీ వివరించింది. ఈ సందర్భంగా యాంటీ-ర్యాగింగ్ వీక్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు, నినాదాలు రాయడం, వ్యాస రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ పోటీలు, వీధి నాటకాలు, యాంటీ-ర్యాగింగ్ ఇతివృత్తాల పై డిబేట్స్ వంటి కార్యకలాపాలతో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించింది. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేసి, వారిని భాగస్వాములను చేయాలని తెలిపింది. డిజిటల్ పోస్టర్లు, షార్ట్ వీడియోలు, యాంటీ-ర్యాగింగ్ సందేశాలను హైలైట్ చేసే రీల్స్‌పై దృష్టి సారించేలా నేషనల్ కాంటెస్ట్ 2025 ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి కాలేజీలు, యూనివర్సిటీలు కృషి చేయాలని యూజీసీ ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు యాంటీ-ర్యాగింగ్ పోర్టల్ అందుబాటులో ఉన్నాయి. విద్యా సంస్థలు డిజిటల్ ప్రచారం కూడా చేయవచ్చు. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను వినియోగించవచ్చని వివరించింది. వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, సెల్ఫీ కార్నర్‌ల వంటి సృజనాత్మక మార్గాలు వంటి అవగాహన కార్యకలాపాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలని సూచించింది. ఆఫ్‌లైన్ కార్యకలాపాలతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల కోసం విద్యా సంస్థలు యాంటీ-ర్యాగింగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న షార్ట్ మువీలు, అవగాహన వీడియోలను ప్రదర్శించాలని సంస్థలకు సూచించింది.



# పోకిరీల బెండు తీస్తున్న షీటీమ్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఆడాళ్ల జోలికి వస్తే తోలు తీస్తామంటున్నారు హైదరాబాద్ షీ టీమ్స్. నిత్యం పబ్లిక్ ప్లేసుల్లో మారు వేషాల్లో గస్తీ కాస్తూ ఆకతాయిలను అదుపులోకి తీసుకుంటున్నారు. తాజాగా మహిళలను పబ్లిక్ ప్రదేశాల్లో వేధించిన 33 మందిని సైబరాబాద్ షీ టీమ్స్ అరెస్ట్ చేశాయి. ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌లో ఈ అరెస్టులు జరిగాయి. వివిధ సోర్సుల ద్వారా మహిళల నుంచి వచ్చిన 25 ఫిర్యాదులకు షీ టీమ్స్ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాయి. అంతే కాకుండా, కాపురంలో విబేధాలతో సతమతం అవుతున్న 21 జంటలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లలో కూర్చోబెట్టి మాట్లాడి, సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేశారు. జూలై నెలలో మాత్రమే షీ టీమ్స్ 49మందిని అరెస్ట్ చేశారు. 48 పెట్టి కేసులు నమోదు చేసి, అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళా బాధితుల నుంచి 30 ఫిర్యాదులు అందుకుని.. వాటిపై తక్షణ చర్యలు చేపట్టారు. మహిళలు, బాలికల భద్రత కోసం 64 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబరాబాద్ ఉమెన చిల్డ్రన్ సేఫ్టీ వింగ్‌లో 5 కౌన్సెలింగ్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. సైబరాబాద్ షీ టీమ్స్ 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ.. మహిళల భద్రత కోసం కట్టుబడి ఉన్నాయని అధికారులు వివరించారు.

# రాజ్యాంగం మార్చాలన్న కుట్రలో బీజేపీ

- క్విట్ బీజేపీ నినాదంతో ముందుకు వెళ్లాల్సిందే
- క్విట్ ఇండియా కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్, ఆగస్టు 9:** రాజ్యాంగం మార్చాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ చర్యలన్నీ ఈ కోవలో భాగంగానే సాగుతున్నాయని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. క్విట్ బిజెపి నినాదంతోనే దేశానికి రక్ష అన్నారు. అలాగే.. ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమం ఏ విధంగా జరిగిందో నేటి యువత తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 1942లో బ్రిటీ-ష్ పాలకులను తరిమి కొట్టాలని అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైనదని ఉద్ఘాటించారు. డూ ఆర్ డై నినాదంతో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం చేశారని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ.. కాంగ్రెస్ చరిత్రను తుడిచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్.. నెహ్రూ, సర్దార్, సుభాష్ చంద్రబోస్ లాంటి నేతలను చరిత్రలో లేకుండా చేద్దామని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర సంస్థలను వాడుకొని ప్రతిపక్షాలపై మోదీ ప్రభుత్వం కుట్ర పూరిత దాడి చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎలక్షన్ కమిషన్.. బీజేపీ ఫ్రంటల్ ఆర్గనేషన్‌గా మారిందని ఆక్షేపించారు. ప్రశ్నిస్తే దేశ ద్రోహుల ముద్ర వేస్తున్నారని దుయ్యబట్టారు. క్విట్ బీజేపీ అంటేనే దేశానికి భవిష్యత్తు అని ఉద్ఘాటించారు. కులాలు, మతాల పేరిట బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేస్తోందని విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్కరంటే ఒక్కరూ కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు లేరని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ దేశ స్వాతంత్ర్య కోసం ఉద్యమం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఈ దేశ రక్షణ కోసం పని చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకోను

## ఫోన్ ట్యాపింగ్‌లో తండ్రీకొడుకుల హస్తం : బండిసంజయ్

**కరీంనగర్, ఆగస్టు 9 :** ఎప్పటికైనా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుపాలు కావల్సిందేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, కేటీఆర్ బీఆర్ఎస్ నేతలందరి ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు. సొంత పార్టీ నేతలపై కేసీఆర్‌కు నమ్మకం లేదన్నారు. తాను నోటీసులు ఇచ్చుకుంటూ పోతే.. తండ్రీ కొడుకులు ఇద్దరూ జీవితాంతం జైల్లోనే ఉంటారంటూ మండిపడ్డారు. మావోయిస్టు సానుభూతి పరులమంటూ తన పేరును, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పోలీసుల లిస్టులో చేర్చారని చెప్పారు. శనివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ నేతలకు సిగ్గుంటే పార్టీ నుంచి బయటకు రావాలన్నారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై అసెంబ్లీలో చర్చ ఎందుకు జరపడం లేదు?. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐ ఇస్తే కొల్లిక్కి వస్తుందని పేర్కొన్నారు. రాధాకిషన్ వాంగ్మూలంలో కేసీఆర్ పేరు ఉందని, కానీ విచారణ కోసం కేసీఆర్‌ను ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. నేను కూడా కుటుంబ సభ్యులపై ప్రమాణం చేస్తా. ఏ గుడికి రమ్మంటారో టైమ్, డేట్ చెప్పాలని సవాల్ విసిరారు. కేటీఆర్ లీగల్ నోటీసులకు నేను భయపడను' అని అన్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ చేసిన ఆరోపణలను కేటీఆర్ ఖండించారు. తాజాగా, బండి సంజయ్‌కి లీగల్ నోటీసు పంపించారు. రాబోయే 48 గంటల్లో తనపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రికి కనీస సాధారణ జ్ఞానం కూడా లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ నిర్లక్ష్యపు ప్రకటనలు హద్దులు దాటాయన్నారు.



రాఖీ పండుగ సందర్భంగా శనివారం నాంపల్లి క్రిమినల్ కోర్టు సీనియర్ న్యాయవాది, టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కురుమ నరేందర్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

# సీఎం ఇంట రాఖీ సందడి

## రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రులు తదితరులు



**హైదరాబాద్, ఆగస్టు 9:** రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సందడి నెలకొంది. మహిళా మంత్రులు, ఇతర ప్రతినిధులు పెద్దఎత్తున తరలిరావడంతో రాఖీ పండుగ కోలాహలంగా సాగింది. ముఖ్యమంత్రికి మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క రాఖీ కట్టారు. మాజీ మంత్రి డాక్టర్ గీతా రెడ్డి రాఖీ కట్టి ఆశీర్వదించారు. వీరితో పాటు మరెందరో సోదరీమణులు రాఖీ కట్టారు. ఈ వేడుకలో పాల్గొన్న బ్రహ్మకుమారీస్ సోదరీమణులు ముఖ్యమంత్రిని కలిసి రాఖీ కట్టారు. మలక్ పేట ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల విద్యార్థినులు ముఖ్యమంత్రిని కలిసి ఆప్యాయంగా రాఖీ కట్టారు. అలాగే, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, బీసీ కమిషన్, విద్యా కమిషన్, శిశు సంక్షేమాభివృద్ధి కమిషన్, రైతు కమిషన్ కు చెందిన మహిళా ప్రతినిధులు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావుతో పాటు మహిళా ప్రతినిధులు రేవంత్ రెడ్డికి రాఖీ కట్టారు.

# బహుశా రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటా : మల్లారెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 9:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మల్లారెడ్డి తన రాజకీయ జీవితంపై సంచలన కామెంట్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, తెలుగుదేశం వైపా, బీఆర్ఎస్ పార్టీల వైపా అన్నది కాదని.. తాను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని క్లారిటీ ఇచ్చారు మల్లారెడ్డి. తాను ఇప్పుడు ఏ వైపునకు చూసేటట్లుగా కూడా లేనని స్పష్టం చేశారు. తనకు 73సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏవైపునకు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పుకొచ్చారు. అస్సలు తాను రాజకీయమే వద్దనుకుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుంటున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

# గోవాలో తెలుగు జంటపై దాడి

**హైదరాబాద్, ఆగస్టు 9:** గోవాలో మరో దారుణం చోటుచేసుకుంది.. గోవా విహార యాత్రలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఓ జంటపై పనాజీ బస్‌స్టాండ్ వద్ద దాడి జరిగింది. బైక్ అద్దె విషయంలో జరిగిన చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసింది. వరుసగా సెలవులు రావడంతో.. హైదరాబాద్‌కు చెందిన ఈ జంట గోవాలో గడిపేందుకు వెళ్లారు. అక్కడ ప్రయాణానికి బైక్ అద్దెకు తీసుకున్నారు. ఒప్పందం ప్రకారం.. బైక్‌ను సమయానికి తిరిగి అప్పగించినప్పటికీ.. బైక్ అద్దెకు ఇచ్చినవాళ్లు అదనంగా రూ.200 చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఎందుకు చెల్లించాలంటూ వారు.. బైక్ అద్దెకు ఇచ్చిన వారిని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరువురు మధ్య వాగ్వాదం తలెత్తింది.. ఈ క్రమంలో పనాజీ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న కొంతమంది బైక్ అద్దెకు ఇచ్చే వ్యక్తులు గుంపుగా వచ్చి జంటపై దాడికి పాల్పడ్డారు. దాడిలో హైదరాబాద్ వ్యక్తి తలకు గాయాలపాలయ్యారు. గర్భిణి అయిన మహిళకు ముఖం తీవ్రంగా ఉబ్బిపోయింది. గాయాలైన జంటను వెంటనే గోవా మెడికల్ కాలేజ్‌కి తరలించారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ఘటనలు గోవాలో పర్యాటకుల భద్రతపై ప్రశ్నలు రేపుతున్నాయి. పోలీసులు పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా గోవాలో జరిగిన గొడవలో ఏపీకి చెందిన ఓ యువకుడు మరణించిన విషయం తెలిసిందే.. ఇలాంటి ఘటనల నేపథ్యంలో గోవాకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండటం మంచిదని పోలీసులు చెబుతున్నారు.

# సోదరీ సోదరిమణులకు మోదీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9 :** రాఖీ పండుగ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ పండుగ సోదరీ-సోదరుల మధ్య ప్రేమను మరింత పెంచుతుందని గుర్తు చేశారు. అలాగే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఈ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సోదరీ-సోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, రక్షణ వంటి అవినాభావ బంధాన్ని సూచిస్తుందని ఆయన అన్నారు. ఈ పండుగ మీ జీవితంలో ఆనందం, ఉత్సాహం నింపాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ పండుగ సోదరీమణుల రక్షణ స్ఫూర్తిని మరింత బలపరుస్తుందని ఆయన ఆశించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారు కూడా ఈ సందర్భంగా తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ శుభ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. ఈ పండుగ రాఖీ దారం పవిత్రతకు చిహ్నం మాత్రమే కాదు, సోదరీమణుల గౌరవం, భద్రత, ఆనందం, శ్రేయస్సుకు నిబద్ధత కూడా అని గుర్తు చేశారు. ఈ పండుగ మనలో రక్షణ స్ఫూర్తిని బలపరచాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇదే రోజున, మన దేశ చరిత్రలో మరో ముఖ్యమైన సంఘటన కూడా జరిగింది. అదే క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన రోజు. నేడు 83వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ గారు ఆ ఉద్యమంలో పాల్గొన్న ధైర్యవంతులకు నివాళులు అర్పించారు. బాపు గారి స్ఫూర్తిదాయక నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ధీరులందరినీ మనం కృతజ్ఞతతో గుర్తుంచుకుంటామని గుర్తు చేశారు. ఆ ఉద్యమం అనేక మంది ప్రజలను స్వేచ్ఛ కోసం ఏకం చేసిందని, మన స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించారు. ఆ ధీరుల త్యాగం వల్లే మనం ఈ రోజు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నామని అభిప్రాయం వ్యక్తం చేశారు.



# ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం

## ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్



**ఢిల్లీ, ఆగస్టు 9 :** ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో ఐదు పాకిస్తాన్ జెట్లను పేల్చిపడేశాము. ఐదు జెట్లను మాత్రమే కాకుండా.. ఓ భారీ 'ఎయిర్‌బర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్'ను కూడా కూల్చేశాము. రెండు వైమానిక స్థావరాలు ధ్వంసం చేశాం. మే 9, 10 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. మే 9వ తేదీ రాత్రి ఎక్కువగా పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు చేశాం. డ్రోన్, ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ బాగా పనిచేసింది. వారి యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నాం. వాటిని ఎంతో సమర్థవంతంగా కూల్చిపడేశాం. ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశమిచ్చాం' అని ఆయన అన్నారు. కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అమాయక పర్యాటకులను కాల్చి చంపారు. 26 మందిని బలి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో 100 మంది ఉగ్రవాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో పాక్ తట్టుకోలేకపోయింది. యుద్ధానికి దిగింది. యుద్ధంలో భారీ ఎత్తున నష్టపోయింది. చివరకు తోకముడిచింది.

# శ్రీవారి ఆలయంలో ఉపాకర్మ సేవ



**తిరుమల, ఆగస్ట్ 9:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిత్యం ఏదోఒకటి కైంకర్యం జరుగుతుంది. శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో స్వామి వారికి ఉపాకర్మ సేవ వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు స్వామివారికి శ్రీ భూవరహస్వామి వారి ఆలయంలో సంప్రదాయంగా యజ్ఞోపవీతాన్ని మార్చారు. శ్రీకృష్ణస్వామివారిని.. శ్రీ భూవరహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్చక స్వాముల వారు కలియుగ దేవుడు..తిరుమల శ్రీవెంటేశ్వర స్వామికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యజ్ఞోపవీతాన్ని సమర్పించి .. హారతి ఇచ్చి.. ఆస్థానం నిర్వహించి మరల ఊరేగింపుగా గోవింద నామ స్మరణతో శ్రీ కృష్ణ స్వామి వారిని తిరిగి ఆలయానికి చేరుకుంటూ .. భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పారుపత్తేదార్ హిమంతగిరి, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంపాదకీయం



# గాలికొదిలేసిన గిరిజన సంక్షేమం

గిరిజనుల అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. కనీస రహదారులు, వైద్యం, విద్య, మంచినీరు వంటి సదుపాయాలు నేటికీ గిరిజన గూడాల్లో కనిపించవు. ఆపదొస్తే డోలీలో మోసుకు అవడం ఇప్పటికీ ఈచూస్తున్నాం. ఇటీవల ఓ గర్భిణిని కాన్పు కోసం డోలీలో వర్షంలో తడుచుకుంటూ మోసుకొచ్చారు. అంటే ఇంకా మనం వారి అభివృద్ధి విషయంలో వెనకబడే ఉన్నామని చెప్పాలి. ఎపిలో పవన్ కళ్యాణ్ డిప్యూటి సిఎం అయ్యాక కొన్ని సమస్యలపై దృష్టి సారించారు. అందుకు ఆయనను అభినందించాల్సిందే. అలాగే తెలంగాణలో సీతక్క అడవిబిడ్డ కావడంతో వారి కష్టాలు తెలుసుకుని ముందుకు సాగుతున్నారు. తనవంతుగా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే మిగతా రాష్ట్రాల సంగతి పక్కన పెడితే తెలుగు రాష్ట్రాల్లో వారి జీవితాల్లో ఇంకా వెలుగులు నిండలేదు. ప్రభుత్వాలు చెబుతున్నంతగా అభివృద్ధి జరగడంలేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. ఏటా ఉత్సవాలు చేయడం, వారికి తాయిలాలు ప్రకటించడం తప్ప గట్టిగా చర్యలకు మాత్రం పూనుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా ఆదివాసీల పట్ల పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. నేటికీ వైద్యం అందుబాటులో లేదు. ప్రతి సంవత్సరం మలేరియా, -టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో వందలాది మంది మరణిస్తున్నారు. ఆసుపత్రులు ఎన్ని ఉన్నా సరైన మందుల, వైద్యులు, ఇతర సిబ్బంది కొరత వెంటాడుతుంది. సరైన రహదారి సౌకర్యాలు లేక నేటికీ గిరిజనులు డోలీమోతతోనే ఆసుపత్రికి చేరుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి వైద్యం అందక దారి మధ్యలోనే మరణిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో విద్య అందనంత దూరంలో ఉంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల్లో సీట్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతంత మాత్రమే సీట్లు ఉండడంతో చదువు మధ్యలోనే ఆగిపోతుంది. సంక్షేమ హాస్టళ్లల్లో సౌకర్యాలు లేమి, పౌష్టికాహారం లోపంతో పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. చదువుకున్న విద్యార్థులకు సరైన ఉపాధి లేక రోజురోజుకూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా తయారైంది. చదువుకున్న యువతీయువకులు వలసలు వెళ్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద ఉన్న ప్రకృతి మధ్యలో నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు.

**మనదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.6 శాతం ఆదివాసీలు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. అక్షరాస్యతతో పోలిస్తే గిరిజన ప్రాంతంలో అక్షరాస్యత అతి తక్కువ. మహిళ అక్షరాస్యత 34.67 శాతం. గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులు రాజ్యాంగం కల్పించింది. వీరి అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు, పరిపాలన వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అమలు జరగడం లేదు.**

షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నాన్ షెడ్యూల్ మండలాల్లో వేలాదిమంది గిరిజనులు ఉన్నారు. వీరి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా గిరిజన చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. మెజార్టీ గిరిజనులు అడవిలో జీవిస్తున్నారు. విలువైన ఖనిజాలు కూడా వీరి నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఇంత విలువైన సంపదను గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను బలహీనం చేసి, అటవీ భూమి, సహజ వనరులను బహుళజాతి, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. మనం ఎంతో అభివృద్ధి చెందామని భావిస్తున్న ఈ రోజుల్లో కూడా ఆదివాసీలు కనీస సౌకర్యాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు నోచుకోలేదు. ఆదివాసీలను భూముల నుండి దూరం చేసే కుట్రలు సాగుతున్నాయి. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70, అటవీ హక్కుల చట్టాలను ఒక్కొక్కదాన్ని నీరు గారుస్తున్నారు. అటవీ భూముల్ని సాగు చేసుకున్న వారికి అటవీహక్కుల చట్టం ప్రకారం 10 ఎకరాల వరకూ హక్కుపత్రాలు ఇవ్వాలి. కానీ గిరిజనుల సాగులో ఉన్న భూములకు నేటికీ పట్టాలు ఇవ్వడం లేదు. హక్కు పత్రాలు ఇచ్చిన అరెకరం, ఎకరం లోపునే ఎక్కువ మందికి ఇచ్చారు. అడవులను నమ్ముకుని బతుకుతున్న కోట్లాదిమంది బతుకు నాశనం చేసే నిర్ణయం కేంద్రం తీసుకొచ్చింది. గ్రామసభ అనుమతి లేకుండా అటవీ భూములను వివిధ ప్రాజెక్టులకు వినియోగించే పక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. అటవీ పరిరక్షణ నిబంధనలకి 2022లో నోటిఫైడ్ చేస్తూ కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఆదేశాలు జారీ చేసింది. అడవుల్లో నివశించే గిరిజనుల అనుమతి అవసరం లేకుండా భూములు కేటాయింపు జరుగుతోంది. ఇది అత్యంత ప్రమాదకర మని ఇప్పటికే గిరిజన సంఘాలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో అడవులను నమ్ముకుని కోట్లాదిమంది జీవిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. నదీ జలాలన్నీ ఏజెన్సీల్లోనే ఉన్నాయి. కానీ ఆదివాసీలకు రక్షిత మంచినీరు అందుబాటులో లేదు. ఏజెన్సీ గ్రామాలకు సంపూర్ణంగా విద్యుత్ సదుపాయం లేదు. ఈ సమస్యలను పరిష్కరించకుండా ఎన్ఇన హామీలు ఇచ్చినా గిరిజన సంక్షేమం నెరవేరదని పాలకులు గుర్తించాలి. కనీస సౌకర్యల కల్పన విద్యవిద్యం వంటి విషయాల్లో అడుగులు పడాలి.

# ఊపందుకున్న ట్రంప్ వ్యతిరేక ప్రచారం

- అమెరికా ఉత్పత్తులు బ్యాన్ చేయాలన్న డిమాండ్
- ఎక్స్ వేదికగా కోకాకోలా, పిజ్జా,కెఎఫ్‌సిల బహిష్కరణ ఉద్యమం




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9:** ట్రంప్ తీరుపై ఆగ్రహంతో ఉన్న భారతీయులు ఆయనకు వ్యతిరేకంగా ఏకమవుతున్నారు. అమెరికా ఉత్పత్తులను నిషేధించాలన్న స్థాయికి ప్రచారం చేస్తున్నారు. ఇది ఒక భారత్‌లోనే కాదు...ప్రపంచ వ్యవప్తంగా వస్తోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా సొంత దేశంతో పాటు అంతటా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ట్రంప్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపెయిన్లలో భాగస్వాములవుతున్నారు. 1500కు పైగా పోస్టులు 'ట్రంప్ ఈజ్ అన్‌ఫిట్ ఫర్ ఆఫీస్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో, 'అరెస్ట్ ట్రంప్' అనే హ్యాష్‌ట్యాగ్, కీలక పదాలతో కూడిన పోస్టులు 1900 ఉన్నాయి. దాదాపు 300 మంది నెటిజన్లు వ్యక్తిగత దూషణలు, అవమానపర్చే పదాలతో 3000కు పైగా పోస్టులు చేశారు. అమెరికా అధ్యక్షుడిని టార్గెట్ చేసుకుంటూ ఇలాంటి పదాలను వినియోగించే ధోరణి ఇటీవల ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోయింది. అమెరికా ఉత్పత్తులు, వ్యాపారాలను బహిష్కరించాలంటూ భారత్ నుంచి విస్తృతస్థాయిలో పిలుపులు రావటం బహుశా ఇదే మొదటిసారి అని విశ్లేషకులు చెప్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిపై భారతీయుల్లో వ్యతిరేకత పెరిగిపోతున్నది. భారత్‌తో పాటు ఇతర దేశాలపై ఎడాపెడా సుంకాలు విధిస్తున్న ఆయన తీరును వారు తప్పుబడుతున్నారు. ఒకప్పుడు ట్రంప్‌నకు మద్దతిచ్చినవారు, అమెరికాకు ఆయనే మళ్లీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారు సైతం ఇప్పుడు ఆయన వద్దంటే వద్దు అని తెగేసి చెప్తున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్ వేదికగా పలు సామాజిక మాధ్యమాల్లో ట్రంప్‌నకు, అమెరికా ఉత్పత్తులు, కంపెనీలకు వ్యతిరేకంగా ప్రచారం తీవ్రమైంది. అమెరికా కంపెనీలను బాయ్ కాట్ చేయాలని, ట్రంప్ చర్యలను ప్రతిఘటించాలని కొందరు భారతీయులు పిలుపునిస్తున్నారు. భారత్‌లో 'ఎక్స్' వేదికగా ట్రంప్ వ్యతిరేక వైఖరి పెరిగిపోయిందని గుర్తించింది. రష్యా నుంచి చమురు ఉత్పత్తుల కొనుగోలు చేస్తున్నదన్న కారణంతో భారత్‌పై ట్రంప్ ఇప్పటికే 25శాతం సుంకాన్ని విధించారు. పెనాల్టీగా పేర్కొంటూ ఈనెల 28న మరో 25 శాతం టారిఫ్‌ను విధించేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైన విషయం తెలిసిందే. తాజా విశ్లేషణ ప్రకారం.. భారత్‌పై ఆయన విధించిన టారిఫ్ పెరుగుదల భారతీయుల్లో ఈ ఆగ్రహానికి కారణమైంది. అమెరికా కంపెనీలను టార్గెట్ చేసుకుంటూ వాటిని బాయ్ కాట్ చేయాలన్న క్యాంపెయిన్ 'ఎక్స్'లో తీవ్రమైంది. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారాలే లక్ష్యంగా వేలాదిగా ఎక్స్ పోస్టులు వచ్చి పడుతున్నాయి. ఇందులో పది వేల వరకు పోస్టులు కోకాకోలాను బ్యాన్ చేయాలన్నవే ఉన్నాయి. 9,100కు పైగా పోస్టులు మెటాకు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌ను టార్గెట్ చేసుకున్నాయి. స్టార్‌బక్స్‌ను బాయ్ కాట్ చేయాలని 5,200కు పైగా పోస్టులు డిమాండ్ చేశాయి. ఇక 2,700 పోస్టులు పిజ్జాహట్‌ను, ఐదువేలకు పైగా పోస్టులు కెఎఫ్‌సిని టార్గెట్ చేశాయి. కనీసం పదివేల పోస్టులు 'బాయ్‌కాట్ యుఎస్‌ఎ', 'బాయ్ కాట్ యుఎస్', 'బాయ్ కాట్ అమెరికా' అనే కీలక పదాలను కలిగి ఉన్నాయి. ట్రంప్ టారిఫ్ వార్‌పై భారత్ మాత్రమే కాదు.. ప్రపంచంలోని పలు దేశాలు సైతం ఇదే వైఖరిని అవలంభిస్తున్నాయి. ఈ ఆగ్రహం కెనడాలో మూడు నెలల క్రితమే ప్రారంభమైంది. అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టాలని నిర్ణయించుకున్నది. ఈ మేరకు అత్యంత ప్రాచుర్యం కలిగిన అమెరికానో కాఫీని 'కెనడియానో'గా పేరు మార్చింది. ఇటు యూరప్‌లో సైతం అక్కడి వినియోగదారులు యూఎస్ అవలంబిస్తున్న విదేశాంగ విధానంపై కూడా ఇదే స్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. సుంకాలతో గందరగోళం సృష్టిస్తున్న ట్రంప్ వ్యవహారం విషయంలో ఆయనకు చెందిన 'ట్రంప్ టవర్'పై చర్చ నడుస్తున్నది. ట్రంప్ విధిస్తున్న సుంకాలకు ప్రతిగా హైదరాబాద్‌తో పాటు గురుగ్రామ్, కోల్‌కతా, ముంబయి, పూణేలలో గల 'ట్రంప్ టవర్' రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో విలాసవంతమైన అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లపై భారీ పన్నులు విధించాలని పలువురు సోషల్ మీడియా యూజర్లు అభిప్రాయపడుతున్నారు.


# 334 రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు

### బీహార్ ఓట్ల రివిజన్‌ను సమర్థించుకున్న ఈసీ




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9:** దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. నిబంధనల ప్రకారం.. ఈసీ వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటువేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఇదిలావుంటే బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారి పార్టీకి మద్దతుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని.. 65 లక్షల ఓట్లను తొలగించిందంటూ విపక్ష పార్టీలు ఆరోపించాయి. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేపట్టాయి. ఇటీవల ఢిల్లీ వేదికగా రాహుల్‌గాంధీ విందు ఏర్పాటు చేసి ఓట్ల కుట్రపై ప్రజెంటేషన్స్ ఇచ్చారు. తాజాగా ఇదే అంశంపై ఎన్నికల సంఘం స్పందించింది. బీహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై రాజకీయ పార్టీలు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు గానీ అభ్యంతరాలు సమర్పించలేదని వెల్లడించింది. ఓటర్ల జాబితా ప్రకటించిన దగ్గర ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదని పేర్కొంది. జూలై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీహార్‌లో జరుగుతున్న ఓట్ల ప్రత్యేక సర్వేపైనే సభలో ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వాయిదాల పర్వం కొనసాగుతోంది. అయితే ఈ ఆరోపణలను ఈసీ ఖండించింది. అనర్హులైన ఓటర్ల పేర్లనే తొలగిస్తున్నట్లు తెలిపింది.

# మిలటరీ, సాంకేతిక అంశాలపై రష్యాతో భేటీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన దోవల్.. తాజాగా ఆ దేశ ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిలిటరీ-సాంకేతిక ఒప్పందాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు రష్యా రాయబార కార్యాలయం ప్రకటించింది. పౌర విమానాల తయారీ, రసాయన పరిశ్రమ సహా ఇతర వ్యూహాత్మక రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల పురోగతిని ఇరుపక్షాలు సమీక్షించినట్లు పేర్కొంది. కాగా, ఈనెల 7న పుతిన్‌తో దోవల్ భేటీ అయిన విషయం తెలిసిందే. క్రెమ్లిన్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశంలో రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షోయిగు, క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషకోవ్ పాల్గొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లతో భారత్‌పై అమెరికా అధిక సుంకాలు వధించిన వేళ దోవల్ మాస్కో పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో స్వదేశంలో భారత్, రష్యా 23వ వార్షిక సమావేశం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన మోడీ.. ఉక్రెయిన్ యుద్ధం పురోగతి విషయమై రష్యా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. 'స్నేహితుడు పుతిన్‌తో సంభాషణ సమగ్రంగా, ఉపయుక్తంగా సాగింది. ఉక్రెయిన్ యుద్ధం తాజా అప్‌డేట్స్ విషయంలో ఆయనకు ఫోన్‌లోనే ధన్యవాదాలు తెలియజేశాను. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై కూడా ఇద్దరం చర్చించాం. అంతేకాదు రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో కట్టుబడి ఉన్నామని పుతిన్‌తో చెప్పాను. ఈ ఏడాది చివర్లో పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించనున్నాను' అని మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మరోసారి భారత్ తటస్థ వైఖరిని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాధినేతలు చర్చించుకొని.. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

# పిల్లల సమక్షంలో ప్రధాని రక్షాబంధన్

**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీకి రాఖీ కట్టారు. అనంతరం వారితో మోదీ ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతేడాది ప్రధాని ఇలాగే స్కూల్ విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్నారు. అంతకుముందు రాఖీ పండుగను పురస్కరించుకొని ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. 'సోదర సోదరీమణుల మధ్య అపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్. ప్రజంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.




# సేవింగ్స్ ఖాతా బ్యాలెన్స్ 50 వేలు

### ఐసీఐసీఐ బ్యాంక్ నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 9:** ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ తన సేవింగ్స్ ఖాతాల కనీస సగటు- బ్యాలన్స్ నిబంధనల్లో భారీ పెంపు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ మార్పు మెట్రో, అర్బన్, సెమీ-అర్బన్, గ్రామీణ బ్రాంచ్‌ల ఖాతాదారులందరిపై ప్రభావం చూపనుంది. ఈ పెంపుతో దేశీయ బ్యాంకులలో అత్యధిక 'కనీస సగటు బ్యాలన్స్' ఐసీఐసీఐ బ్యాంక్‌దే అవుతోంది. కొత్తగా సవరించిన నిబంధనల ప్రకారం.. మెట్రో, అర్బన్ ప్రాంతాల ఖాతాదారులు సగటు-న 50,000 కనీస నిల్వ ఉంచాలి. ఇది ఇంతకు ముందు ఉన్న 10,000 నుంచి 50,000కు పెరగడంతో.. ఐదు రెట్లు పెరిగినట్టే. సెమీ-అర్బన్ బ్రాంచ్‌లలో కనీస బ్యాలెన్స్ 5,000 నుంచి 25,000కు పెరిగింది. అలాగే గ్రామీణ బ్రాంచ్‌లలో మాత్రం 2,500 నుంచి 10,000కు పెంచారు. ఇకపోతే, దేశంలోనే అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2020లోనే మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనను పూర్తిగా రద్దు చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మెట్రో, అర్బన్‌లో 10,000, సెమీ-అర్బన్‌లో 5,000, గ్రామీణ బ్రాంచ్‌లలో 2,500గా ఉంచింది. బ్యాంకులు తమ రోజువారీ కార్యకలాపాలు, పెట్టుబడుల ఖర్చులను తీర్చుకునేందుకు మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనలను అమలు చేస్తాయి. ఈ పరిమితి కంటే తక్కువ నిల్వ ఉంచిన ఖాతాదారులపై జరిమానాలు కూడా వేస్తుంటాయి. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఆగస్టు 1 నుంచి కొత్త నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత సవరించిన ఫీజు చార్ట్ ప్రకారం జరిమానాలు విధించనుంది.

# ఆదివాసీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

మొదటి పేజీ తరువాయి



మండలం వంజంగిలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. వంజంగిలో వనదేవత మోదకొండమ్మ ఆలయాన్ని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలో కాఫీ తోటలను పరిశీలించి, గిరిజన సంప్రదాయ వేడుకలను తిలకించారు. ఆదివాసీ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. టూరిజం అభివృద్ధిపై తీసుకుంటున్న చర్యలు, ప్రాజెక్టుల వివరాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**గిరిపుత్రుల మధ్య ఉండటం సంతోషాన్నిస్తోంది**

ఈ రోజు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. అంతర్జాతీయ గిరిజన దినోత్సవం అన్నా చెల్లెళ్ల అనుబంధం చాటే రాఖీ పండుగ. ఇలాంటి పవిత్రమైన రోజున పాడేరులో ఇలా గిరిపుత్రులు మధ్యలో ఉండటం నాకు సంతోషాన్నిస్తోంది. పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో కష్టపడుతున్నాను. గతంలో పాడేరు రావాలనుకున్నా వాతావరణం అనుకూలించక రాలేకపోయాను. ఏజెన్సీ అంటే దేవుడు సృష్టించిన అద్భుతం. ఇక్కడికి వస్తున్న సమయంలో కొండలు, పచ్చటి వాతావరణం చూశాను. మళ్లీ జన్మ ఉంటే ఇక్కడ పుట్టాలని ఉంది. విత్తన పండుగలు, సంక్రాంతి వరకూ ఎంతో పవిత్రంగా జరుపుకుంటారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయి. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు... దాన్ని నేను కొనసాగిస్తున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్**

'గిరిజనుల సంక్షేమంతో పాటు ఆ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గతంలో ఐఏఎస్ అధికారులను ప్రాజెక్ట్ ఆఫీసర్లుగా నియమించి ఐటీడీఏలను బలోపేతం చేశాం. రాష్ట్రంలో ఎస్టీలు 28.32 లక్షలు కాగా అందులో సుమారు 8.41 లక్షలు గిరిజన కుటుంబాలు ఉన్నాయి. 3,77,051 మంది గిరిజనులకు ప్రతినెలా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నాం. పక్క రాష్ట్రాలు చత్తీస్గడ్, ఒడిశాలో ఎంత పెన్షన్ ఇస్తున్నారో ఒకసారి గమనించండి. గిరిజనులకు పింఛన్ల కోసమే ఏడాదికి రూ.1,595 కోట్లు ఖర్చు చేస్తున్నాం... ఇదీ గిరిజనుల సంక్షేమంపై మా చిత్తశుద్ధి. 4.82 లక్షల గిరిజనుల గృహాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం. త్వరలోనే సోలార్ రూఫ్ టాప్ ఉచితంగా ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుడతాం' అని సీఎం హామీ ఇచ్చారు.

**మట్టిలో మాణిక్యాలు గిరి పుత్రులు**

'మన గిరిజన బిడ్డలు మట్టిలో మాణిక్యాలు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని నమ్మాను. తల్లికి వందనం పథకం ద్వారా 1 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న 4,86,803 మంది గిరిజన విద్యార్థులకు రూ.642 కోట్లు తల్లుల ఖాతాలో వేశాం. ఏజెన్సీ పరిధిలోని స్కూళ్లు, కాలేజీల్లో చదువుతున్న 1,76,796 మంది గిరిజన విద్యార్థుల కోసం ఏడాదికి రూ.1,337 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గిరిజన యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళల తయారీ, ఈ-కామర్స్ విక్రయాలపై శిక్షణ ఇస్తున్నాం. నిన్ననే విద్యాశాఖ మంత్రి 373 నూతన భవనాల నిర్మాణానికి రూ.45 కోట్లు విడుదల చేశారు' అని సీఎం చంద్రబాబు వివరించారు.

**గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులు**

'ఆదివాసీల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. గిరిజన గ్రామాల్లో వైద్యానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. 1,487 మంది సికిల్ సెల్ రోగులకు నెలకు రూ.10,000 పింఛన్ ఇస్తున్నాం. గర్భిణీలకు పోషకాహార ప్యాకేజీలు, రవాణా సదుపాయం అందిస్తున్నాం. డోలీ మోతలు లేకుండా 76 బర్త్ వెయిటింగ్ హాల్స్ బలోపేతం చేశాం. 35 కొత్త భవనాలు నిర్మాణంలో ఉండగా 15 మరమ్మతులు చేస్తున్నాం. 122 ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేశాం. రూ.482 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**అరకు కాఫీ అంటే ఒక బ్రాండ్**

'అరకు కాఫీ ప్రపంచవ్యాప్తం కావాలి. అరకు కాఫీ నేను ప్రమోట్ చేసిన బ్రాండ్. ప్యారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేశాం. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు అవుతోంది. దీనిపై 2.46 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. మరో లక్ష ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటలు పెంచాలని ప్రయత్నం చేస్తున్నాం. అలాగే 1.80 లక్షల ఎకరాల్లో చెర్రీ సాగు చేసి 90,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు. మన గిరిజన రైతన్నలు మామిడి, సపోటా, జీడిపప్పు, పనస, నేరేడు, నిమ్మ, సీతాఫలమే కాదు కుంకుమవంటి పంటలు సాగుచేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకప్పుడు ఏజెన్సీ అంటే గంజాయి ప్రాంతమని చెడుగా భావించేవారు. గత ప్రభుత్వం స్వచ్ఛమైన ఏజెన్సీలను కలుషితం చేసింది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఏజెన్సీలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడా గంజాయి మాట వినపడటంలేదు' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రోడ్ల నిర్మాణంతో గిరిజనుల ఇక్కట్లు తీరుస్తాం**

'ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు నిర్మించి గిరిజనుల ఇక్కట్లు తీరుస్తాం. నేషనల్ హైవే సంస్థ ఆధ్వర్యంలో ఏడాదిలో రూ.200 కోట్లతో 203 గిరిజన గ్రామాలకు 269 కి.మీ. మేర బీటీ రోడ్లు వేశాం. ప్రస్తుతం గిరిజన జిల్లాల మీదుగా 515 కి.మీ. పొడవున రూ.8,570 కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. వీటిలో పాడేరు-గొండిగూడ, కొయ్యూరు-చాప్రతిపాలెం, చింతపల్లి, రంపచోడవరం-కొయ్యూరు NH-516E విస్తరణ పనులు, రాయపూర్-విశాఖపట్నం సెక్షన్ NH-130CD, భద్రాచలం-కుంట NH-30 సెక్షన్, లంబసింగి-పాడేరు, చింతూరు-మోటు సెక్షన్లు, పాడేరు బైపాస్, కొత్త ఫ్లై ఓవర్లు ఉన్నాయి' అని సీఎం తెలిపారు.

**విజయవాడ, తిరుపతి, విశాఖలో స్టడీ సర్కిళ్లు**

'పోటీ పరీక్షలకు ఎస్టీ విద్యార్థులను సిద్ధం చేయడానికి రూ.4.5 కోట్లు ఖర్చు చేస్తున్నాం. విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తున్నాం. రూ.150 కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలు వసతి గృహాలుగా మార్చుతున్నాం. రూ.64 కోట్ల వ్యయంతో ఐటీడీ పాడేరులో 418 పాఠశాల భవనాల నిర్మాణాలు చేపట్టాం. పాడేరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు ఆస్పత్రి నిర్మాణం చేపట్టాం. ఐటీడీఏ రంపచోడవరంలోని వై రామవరం మండలాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం 2 మండలాలుగా విభజించాలని నిర్ణయం తీసుకున్నాం. వీటితో పాటు రూ.50 కోట్లతో సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్‌పురం, శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. త్వరలోనే వీటిని పూర్తి చేసి గిరిజనులకు అందుబాటులోకి తెస్తాం.' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఎన్ని ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ హామీల అమలు**

'ఆర్థిక సమస్యలు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. మా గిరిజన ఆడబిడ్డలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. ఏజెన్సీలో 7 క్యాంటీన్ల ద్వారా భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెలాఖరున మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియమాకం భర్తీచేస్తాం. ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నాం. ఈ పెట్టుబడుల ద్వారా 9 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 5 వేల మంది గిరిజన మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఆదాయం వచ్చేలా చేస్తాం' అని ముఖ్యమంత్రి అన్నారు.

**గిరిజన యూనివర్సిటీని పూర్తి చేస్తాం**

1483 గిరిజన హ్యాబిటేషన్లకు రూ.2,850 కోట్ల వ్యయంతో గ్రామీణ సడక్ యోజన కింద ప్రతి ఊరికి రోడ్డు వేస్తాం. రూ.1938 కోట్ల వ్యయంతో ఐటీడీఏలో గిరిజనుల ఆదాయం పెంచే మార్గాలు చూపిస్తాం. రూ.8575 కోట్లో వ్యయంతో 515 కిలోమీటర్ల రహదారులు పూర్తి చేస్తాం. రూ.19,411 కోట్లతో 472 కిలోమీటర్లు అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్లు వేస్తాం. ఎకో టూరిజం కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తాం. విజయనగరం జిల్లా కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజ్ పనులు జరుగుతున్నాయి. విజయనగరం జిల్లాలో 519 ఎకరాల్లో ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం త్వరిగతగతిన పూర్తిచేస్తాం.' అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

**టూరిజం క్లస్టర్లుగా అరకు, లంబసింగి, మారేడుమిల్లి**

అరకు, లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాలను టూరిజం క్లస్టర్లుగా తయారుచేస్తాం. రాబోయే రోజుల్లో స్థానికంగా 1000 వరకూ హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకునేలా ఆర్థిక సాయం చేస్తాం. పాడేరులో మోదకొండమ్మ ఆలయం అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నాం. స్థానికంగా మహిళా శిశు సంక్షేమం కింద 96 అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. విశాఖ జిల్లాలో గిరిజనులందరికీ గ్రామీణ ఆవాజ్ యోజన కింద 54 వేల ఇళ్లు మంజూరు చేస్తాం. బాబాయిని చంపి నెపం నాపై వేద్దామని కుట్ర చేసిన వారి ఆటలు ఇక సాగనివ్వను. వారి ముసుగులు తొలగించి మీకు రక్షణ కల్పిస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



# ఏపీలో మరో జాబ్ నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి

ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి ఏపీ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 11 నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపింది. ఇక రాత పరీక్ష అక్టోబరు 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 2 పేపర్లకు ఈ పరీక్ష జరుగుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పేపర్ 1 పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకూ పేపర్ 2 పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంటెక్‌లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పీజీఈసెట్ కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ప్రకటన జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బోధన రుసుములను చెల్లించకపోవడంతో పలు కళాశాలలు, విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్ల జారీని నిలిపివేశాయి. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తెగేసి చెబుతున్నాయి. ప్రభుత్వ యూనివర్సిటీలు కూడా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఇక ప్రైవేటు కాలేజీల సంగతి సరేసరి. దీంతో చేసేదిలేక ఉన్నత విద్యామండలి కౌన్సెలింగ్ వాయిదా వేసింది. మరోవైపు పీజీఈసెట్ కౌన్సెలింగ్‌కు అవసరమైన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసేందుకు సమయం ఇవ్వాలంటూ అభ్యర్థులు కూడా వరుస విజ్ఞప్తులు కోరడంతో కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటన జారీ చేసింది.

# అంతర్జాతీయ స్థాయికి అరకు కాఫీ..

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అరకు కాఫీకి మరింత బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడమే కాకుండా, ఆదివాసీల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించే దిశగా పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మొత్తం 21 ఒప్పందాలు జరిగాయి. వీటిలో అత్యంత కీలకమైనది, ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం టాటా కన్స్యూమర్స్ సంస్థతో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చేసుకున్న ఒప్పందం. ఈ ఒప్పందం ద్వారా ఆర్గానిక్ అరకు కాఫీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను టాటా స్వీకరించనుంది. ఇది అరకు కాఫీ ఖ్యాతిని కొత్త శిఖరాలకు చేర్చగలదని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, కాఫీ సాగును ప్రోత్సహించేందుకు ఐటీసీ సంస్థ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే 4,010 హెక్టార్లలో కాఫీ సాగు చేస్తున్న ఐటీసీ, అదనంగా మరో 1,600 హెక్టార్లలో సాగును విస్తరించనుంది. గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థలు ఓయో హోమ్స్, హోమీ హట్స్ ముందుకొచ్చాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో హోమ్‌స్టేల అభివృద్ధి, నిర్వహణ కోసం ఈ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీని ద్వారా పర్యాటకులకు మెరుగైన వసతి సౌకర్యాలు లభించడంతో పాటు గిరిజనులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఏపీ గిరిజనోత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేసే లక్ష్యంతో అమెరికాకు చెందిన హాతీ సర్వీసెస్ ఎల్ఎల్సీ సంస్థతో జీసీసీ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలో జీసీసీ రిటైల్ కార్యకలాపాలు ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా గిరిజన ఉత్పత్తుల విక్రయానికి ట్రైఫెడ్‌తో కలిసి జీసీసీ రిటైల్ షోరూమ్‌లను ఏర్పాటు చేయనుంది. ఇవే కాకుండా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర రబ్బరు బోర్డు, చింతపల్లిలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సబ్ కో సంస్థ, పసుపు ప్రాసెసింగ్ కోసం ఎక్విప్ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందాలన్నీ గిరిజనులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం, వారి ఉత్పత్తులకు సరైన ధర కల్పించడం, పర్యాటక రంగం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా జరిగాయి.

# రజనీకాంత్ మా కుటుంబానికి అండగా నిలిచారు

మొదటి పేజీ తరువాయి



50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, తమ కుటుంబానికి కష్టకాలంలో ఆయన అందించిన మద్దతును గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు లోకేశ్ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. "రజనీకాంత్ శకంలో మనం జీవించడం అదృష్టం. ఆయన చిత్ర పరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయం" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇదే సమయంలో ఆయన తమ కుటుంబంతో రజనీకి ఉన్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. "మా కుటుంబం అత్యంత కష్ట కాలంలో ఉన్నప్పుడు రజనీకాంత్ గారు మాకు అందించిన అచంచలమైన మద్దతును ఎప్పటికీ మర్చిపోలేను" అని లోకేశ్ భావోద్వేగంగా తెలిపారు. ఈ సందర్భంగా రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' చిత్ర బృందానికి విజయం చేకూరాలని ఆకాంక్షించారు. అంతేకాదు, స్పెషల్ గా ఎడిట్ చేసిన రజనీకాంత్ పవర్ హౌస్ వీడియోను కూడా లోకేశ్ పంచుకున్నారు.

# పులివెందుల ఉప ఎన్నికల్లో పోలీసుల పక్షపాత వైఖరి



మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ, పులివెందులలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ప్రత్యర్థులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫిర్యాదులు చేసినా స్వీకరించకుండా, బాధితులనే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు పూర్తిగా అధికార పార్టీకి కొమ్ముకాస్తూ, శాంతిభద్రతలను గాలికొదిలేశారని వారు ధ్వజమెత్తారు. ఉప ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో పోలీసులు విఫలమయ్యారని వైసీపీ నేతలు విమర్శించారు. తమ నాయకులపై జరుగుతున్న దాడులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని వారు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. పోలీసుల పక్షపాత వైఖరిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఈ ధర్నాతో ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో గెలిచేందుకు టీడీపీ నేతలు అనేక కుట్రలకు పాల్పడుతున్నారని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అరాచకాలకు పోలీసులు వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. అధికార అండతో అధికారులను టీడీపీ విచ్చలవిడిగా వాడుకుంటోందని మండిపడ్డారు. పులివెందులలో ఏం జరుగుతోందో ప్రజలందరికీ తెలుసని రాచమల్లు అన్నారు. వైఎస్ అనే పేరుకు పులివెందులలో ఓటమే లేదని చెప్పారు. సాక్షి సిబ్బందిపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి మీడియా సిబ్బంది అంతా వైసీపీ కుటుంబ సభ్యులేనని చెప్పారు. టీడీపీ ఎన్ని కుట్రలకు పాల్పడినా జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే టీడీపీ కుట్రలకు తెరలేపిందని ఎద్దేవా చేశారు.

# నాపై దాడికి కుట్ర చేస్తున్నారు

**అమరావతి :** తనపై దాడి కుట్ర జరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ , పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి ఈ కుట్రకు బాధ్యులని ఆరోపించిన ఆయన, వీరిద్దరిపై సుమోటోగా కేసు నమోదు చేసి సీబీఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తన మీద దాడి జరగబోతున్న విషయం టీడీపీ నేతల ద్వారా తనకు ముందే సమాచారం వచ్చిందని సతీష్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పులివెందులలో వైసీపీ నేత మీడియాతో మాట్లాడుతూ, "ఇక్కడ పోలీసులు పచ్చరంగు చొక్కాలు వేసుకుని తిరుగుతున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఒక పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారు. డీజీపీకి ప్రత్యక్షంగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ మీడియా సమావేశం ద్వారా నేను ఏపీ డీజీపీని కోరుతున్నాను. నాకు తెలిసిన సమాచారం ప్రకారం నా మీద దాడి జరగబోతోంది. ఈ విషయం టీడీపీ నేతల ద్వారానే తెలిసింది. నన్ను హత్య చేయాలని కుట్ర జరుగుతోంది. అదే సమయంలో నాకు రాష్ట్ర పోలీసులపై ఎటువంటి నమ్మకం లేదు. నేను నిరాయుధుణ్ని. నన్ను కాపాడే బాధ్యత పోలీసులదే. మీరు నన్ను కాపాడలేకపోతే కనీసం దాడి జరగకుండా చూడాలి. కానీ నామీద ఏమైనా దాడి జరిగినట్లయితే అది రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్, బీటెక్ రవి ప్రోత్సాహంతో జరిగింది అని పరిగణించాలి. నాపై ఏదైనా దాడి జరిగితే వెంటనే వీరిద్దరిపై సుమోటోగా కేసు నమోదు చేసి, సీబీఐతో విచారణ జరిపించాలి" అన్నారు. పులివెందులలో ఉన్న పోలీసులపై కూడా సతీష్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఇక్కడి పోలీసులు పోలీసోళ్లు కాదు. పచ్చ చొక్కాలు వేసుకుని తిరుగున్నారు. డీఎస్పీ, రూరల్ సీఐ, డీఐజీలు పోలీస్ సిబ్బందికి పెత్తనం ఇచ్చారు. నిజాయితీగా పని చేసే అధికారులు పక్కకు జరిగారు. కనుక ఇలాంటి పరిస్థితుల్లో తమకు న్యాయం జరగదని వైసీపీ నేత స్పష్టం చేశారు. పోలీసులు టీడీపీ నేతలకు తొత్తులుగా మారి వ్యవహరిస్తున్నారని, వైసీపీ నేతలను వేధించాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

# వైఎస్ అవినాశ్, భాస్కర్‌కు నోటీసులు

**అమరావతి :** వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డితో పాటు పలువురు వైసీపీ నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. మరోవైపు, పులివెందుల మండలం తుమ్మలపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అయితే పార్టీ మారినందుకు అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, అవినాశ్ పీఏ రాఘవరెడ్డిలతో పాటు తమ గ్రామానికి చెందిన గంగాధర్ రెడ్డిలు తనను తీవ్రంగా బెదిరించారని విశ్వనాథరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ కాల్ డేటాను కూడా పోలీసులకు అందజేశారు. విశ్వనాథరెడ్డి ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. 41ఏ కింద నిందితులకు నోటీసులు ఇచ్చారు. మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న భాస్కరరెడ్డి, శివశంకర్ రెడ్డి బెయిల్ షరతుల మేరకు హైదరాబాద్ లో ఉన్నారు. దీంతో, పులివెందుల పోలీసులు హైదరాబాద్ కు వెళ్లి వారికి నోటీసులు అందించారు. మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. మిగిలిన నిందితులకు పులివెందులలోనే నోటీసులు అందించారు.

# పటాన్ చెరు పోవాలంటే - పరేషాన్ కావాల్సిందే !





**పటాన్ చెరు(జిన్నారం), ఆగస్టు 9, సమయం న్యూస్**

పటాన్ చెరు పోవాలంటే పరేషాన్ కావాల్సిందేనని వాహనదారు వాపోతున్నారు. జిన్నారం మండలం లోని పలు గ్రామప్రజలు ఏదో ఒక పని మీద ప్రతిరోజు పటాన్ చెరువు పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. కానీ పటాన్ చెరువు పట్టణానికి వెళ్లాలంటే మాత్రం పట్టపగలు చుక్కలు లెక్కించాల్సిన పరిస్థితి అక్కడి రహదారులకు ఉంది. మండల పరిధిలోని జిన్నారం, మంగంపేట్, కొడకంచి, మందారం,ఉట్ల, సోలక్ పల్లి , రాళ్లకత్వ అండూర్ గ్రామాల ప్రజలు నిత్యం వందల సంఖ్యలో పటాన్ చెరు పట్టణానికి వెళుతూ ఉంటారు. మండల కేంద్రం నుండి పటాన్ చెరు కు వెళ్ళడానికి రెండు రహదారులు కలవు.దురదృష్టవశాత్తూ రెండు రహదారులు పూర్తిగా చెడిపోయి గుంతల గామారి ఉన్నాయి ఇంద్రేశం నుండి పటాన్చెరువు వరకు గల రహదారి దారుణంగా మారింది. అలాగే మాదారం నుండి బొమ్మలకుంట గ్రామం వరకు రోడ్డు అధ్వాన్న పరిస్థితిలో ఉన్నది. రోడ్లపై అధిక లోడు వాహనాలు తిరగడంవల్ల రోడ్డు ఈ స్థితికి చేరిందని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే నడుము నొప్పి వస్తుందని కొంతమంది ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి రోడ్డు మరమ్మతుకు నిధులు కేటాయించి బాగు చేయించాలని కోరుతున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



**పటాన్ చెరు(జిన్నారం), ఆగస్టు 9, సమయం న్యూస్ :** మండలకేంద్రమైన జిన్నారంలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(కళాశాల) నందు శనివారం ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగోలి, చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసం, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వెంకటయ్య మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను ఆయన విద్యార్థులకు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## నేడు ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం...



**శేరిలింగంపల్లి ఆగస్టు 9 సమయం న్యూస్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందానగర్ డివిజన్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ లీడర్లు నాయకులు పాల్గొని జెండా ఆవిర్భావం, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జరిపేట జైపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చందానగర్ కార్పొరేటర్ రఘునాథ రెడ్డి, రాజేంద్ర,కవిరాజ్, సూర్య రాథోడ్ ,జహంగీర్, అలీ, మోషిన్, సౌందర్య రాజన్ తదితరులు పాల్గొన్నారు

## మల్లారెడ్డి సంచలనం.. రాజకీయాలకు రిటైర్మెంట్...!



**హైదరాబాద్ ఆగస్టు 9 సమయం న్యూస్. :** ప్రస్తుత రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని మాజీ మంత్రి మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, తెలుగుదేశం వైపా, బీఆర్ఎస్ పార్టీల వైపా అన్నది కాదని... తాను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని క్లారిటీ ఇచ్చారు మల్లారెడ్డి. తాను ఇప్పుడు ఏ వైపునకు చూసేటట్లుగా కూడా లేనని స్పష్టం చేశారు. తనకు 73సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏవైపునకు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పుకొచ్చారు. అస్సలు తాను రాజకీయమే వద్దనుకుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుంటున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

## ఘనంగా రాఖీపౌర్ణమి వేడుకలు

### ఆత్మీయతకు ప్రతిబింబం... రక్షాబంధన్



**వెల్దుర్తి ఆగస్టు 09: (సమయం న్యూస్ ) :** ప్రతి ఇంటఅనురాగానికి ప్రతీకకగా నిలిచే రాఖీపౌర్ణమి వేడుకలను వెల్దుర్తి మండలంలో శని వారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సాంప్రదాయబద్ధంగా ఆడపడచులు తమ పుట్టింటిలకు వెళ్లి అన్నయ్యలకు చెల్లెల్లు... తమ్ముళ్లకు చెల్లెల్లు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు తినిపించారు. మహిళలు కుటుంబసభ్యులతో నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు

# తెలంగాణలో ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త...

- రాఖీ పండుగకు స్పెషల్...

**ఈనెల 11 వరకు కంటిన్యూ...**




**హైదరాబాద్ ఆగస్టు 9 సమయం న్యూస్ :** రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం గుడ్ న్యూస్ తెలిపింది. రాఖీ స్పెషల్ పేరుతో ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయం మేరకు ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అలాగే పలు రూట్లలో బస్సు సర్వీసులను సైతం పెంచింది. రాఖీ పండుగ ఉన్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని అన్ని బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా సికింద్రాబాద్, జేబీఎస్, ఎంజీబీఎస్ రూట్లలో బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు గాస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాఖీ స్పెషల్ బస్సులు పెంచాలని నిర్ణయించింది. ఇకపోతే గత ఏడాది రాఖీ పండుగ సందర్భంగా రికార్డు స్థాయిలో ఆర్టీసీకి లభాలు వచ్చాయి. దాదాపు 63 లక్షల మంది ప్రయాణికులను ఆర్టీసీ క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చింది. రాఖీ పండుగ రోజున రికార్డు స్థాయిలో రూ. 32 కోట్ల వరకు ఆదాయం వచ్చిందని తెలిపింది. అందులో మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 17 కోట్లు, నగదు చెల్లింపు టికెట్ల ద్వారా రూ. 15 కోట్ల వరకు వచ్చిందని తెలిపింది. టీజీ ఆర్టీసీ చరిత్రలో ఇది ఆల్టైం రికార్డు అని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. ఈ క్రమంలోనే నేడు ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. టికెట్ ధరలలో 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్ ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది.

**ఆర్టీసీలో ప్రయాణించి సురక్షితంగా వెళ్లండి**

ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

## అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ: పోచారం

**బాన్సువాడలో అక్క చేత రాఖీ కట్టించుకున్న ఎమ్మెల్యే**

**రాష్ట్ర ప్రజలందరికీ రక్షా బంధన్ శుభాకాంక్షలు**





**బాన్సువాడ, (సమయం న్యూస్)** రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్) పండుగ సందర్భంగా బాన్సువాడ పట్టణంలో సోదర–సోదరి బంధం మరింత బలపడింది. ఈ సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి గారికి, ఆయన అక్క శ్రీమతి దొడ్ల సత్యవతి ఆయన నివాసంలో రాఖీ కట్టి పండుగను ఆచరించారు. "రాఖీ పండుగ అన్నా–చెల్లెళ్ల అనుబంధానికి, అక్కా–తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక" అని భావోద్వేగంగా తెలిపారు పోచారం గారు. ఈ పండుగ సోదర–సోదరి సంబంధాలలో ప్రేమ, విశ్వాసం, పరస్పర రక్షణకు చిహ్నమని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రతి ఇంటిలో ఆనందంగా, సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని కోరుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆల్విన్ కాలనీ డివిజన్ ప్రజలందరికీ రాఖీ పర్వ దినోత్సవ శుభాకాంక్షలు - కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్





**శేరిలింగంపల్లి ఆగస్టు 9 సమయం న్యూస్. :** సోదర సోదరీమణులు అత్యంత పవిత్రంగా వారి బంధం పటిష్టంగా ఉండాలని జరుపుకునే రాఖీ పండుగ సందర్భంగా 124 ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ లకు కార్పొరేటర్ వార్డ్ కార్యాలయంలో మహిళలు. అభిమానులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు,ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ళ అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగకు ఎంతో విశిష్టత ఉందని అన్నారు.

## భేరి రామచంద్రర్ యాదవ్ స్వగృహంలో కుటుంబ సభ్యులతో రక్షాబంధన్ వేడుకలు...





**శేరిలింగంపల్లి ఆగస్టు 9 సమయం న్యూస్. :** గచ్చిబౌలి డివిజన్ నేతాజీ నగర్ కాలనీ బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ స్వగృహంలో శనివారం కుటుంబ సభ్యులతో రక్షాబంధన్ వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్న, చెల్లెలు,అక్క,తమ్ముడు అందరు సంతోషంగా ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని అన్నదమ్ముల అనుబంధం పవిత్రమైన బంధాన్ని భావితరాలకు అందించాలని కొనియాడారు,మనమంతా చిన్న చిన్న మనస్పర్థలు చిన్న చిన్న గొడవలు ఆస్తి తగాదాలు ఆస్తులు డబ్బులు బంధాలకు అడ్డుకట్టలు కాకూడదని అవన్నీ పక్కకు పెట్టి అన్నా చెల్లెళ్ల బంధం రక్తసంబంధం ఇది జన్మజన్మల బంధం కాబట్టి తినుచిన్న పొరపాట్లను క్షమించి పెద్దమనసు చేసుకొని అందరు కూడా ఐక్యమత్యంగా ఉండి ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు, మన ముందు రాబోయే తరాలకు మన ఇబ్బందాలు ప్రేమానురాగాలు అందియ్యాలన్నారు, ప్రతి మనిషి జీవితంలో క్రమశిక్షణ క్షమించే గుణం మనందరిలోనే ఉండాలన్నారు, దేశ ప్రజలకు పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా ఎడిటర్లకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు

## టేక్మాల్ మండలం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో రాఖీ పండుగలో పాల్గొన్న కలెక్టర్



మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ ఆగస్టు9( సమయం న్యూస్). సోదర భావానికి ప్రతీక గా రాఖీ పండగ నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.శనివారం టేక్మాల్ మండలం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ బాలికలు కలెక్టర్ కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూబాలికలకు దీవెనలు అందించారు.మన దేశ సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని అన్నారు.ఇది సాధారణంగా సోదరీమణులు తమ సోదరులైన అధికారులకు రాఖీ కట్టి, వారి రక్షణ కోసం ప్రార్థించే ఒక కార్యక్రమం అని వివరించారు.ఇది సమాజంలో సోదరభావం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఒక అవకాశంగా ఉపయోగపడుతుంది.

## డిచ్పల్లి సీ.హెచ్.సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



### తహసీల్దార్ కార్యాలయం సందర్శన

**నిజామాబాద్, ఆగస్టు 09( సమయం న్యూస్).:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఆయన డిచ్పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, జనరల్ వార్డులు, ల్యాబ్ తదితర విభాగాల పనితీరు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. రౌండ్ ది క్లాక్ ఆసుపత్రులలో అన్ని సమయాలలో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. ప్రతీ నెల రెండవ శనివారం ప్రత్యేకంగా నిర్వహించే ఆరోగ్యశ్రీ శిబిరానికి అన్ని విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు హాజరయ్యేలా చూడాలని, పీ హెచ్ సీ లు, సీ హెచ్ సీల పనితీరును ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ డిచ్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి తహసీల్దార్ సతీష్ రెడ్డిని ఆరా తీశారు. త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలని సూచించారు.

## దళితమంత్రులపై, నాయకులపై ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అమానుషం

- జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి



**పటాన్ చెరు, ఆగస్టు 9, సమయం న్యూస్ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బానిసగా మారిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దళిత మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి లపై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని కుల్కూరి నరసింహారెడ్డి ధ్వజమెత్తారు. పటాన్ చెరు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కార్యకర్తల సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రి వివేక్ వెంకటస్వామి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి లపై తన ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు .తెలంగాణ ఉద్యమ సమయంలో దామోదర్ రాజనర్సింహ తెలంగాణకు సంబంధించిన స్థితిగతులను సోనియాగాంధీకి వివరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు . హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద కమిషన్లకు ఆశపడి ప్రభుత్వం పైన కొత్త ప్రభాకర్ రెడ్డి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తూ బ్లాక్మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు నియోజకవర్గం లో కూడా తిరిగి ఇవ్వకుండా అడ్డుకుంటారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి మాజీ పిసిసి కార్యదర్శి మతిన్, ఎస్ కే అతిక్, అక్షిత్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**ఉట్నూర్ ఆగస్ట్ 9( సమయం న్యూస్). :** ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ కొమరం భీమ్ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్. పి. అఖిల్ మహాజన్, ఎ. ఎస్. పి. కాజల్ సింగ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ లతో కలిసి హాజరై కొమురం భీమ్ విగ్రహం వద్ద సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భీమ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ ప్రసిద్ధి పొందయని, దేశంలో ఆదివాసీల సంస్కృతి చాలా గొప్పదని, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని తెలిపారు. వ్యవసాయ సాగులో ఒకే పంట కాకుండా పంట మార్పిడి విధానాన్ని పాటిస్తూ పంటల సాగు చేయాలని, ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా ప్రతి పి వి టి జి గిరిజనులకు, ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సాగునీటి సమస్యలు లేకుండా బాధ్యత తీసుకుంటామని, అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలలో ఆంగ్ల మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టడం జరిగిందని, తద్వారా విద్యార్థులు జేఈఈ మెయిన్స్, ఐ ఐ టి వంటి మరెన్నో ఉన్నత రంగాలలో రాణించేందుకు సులువుగా ఉంటుందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా 180 అంబులెన్స్ లను పి.వి.టి.జి. గ్రామాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, రోడ్లు నిర్మించడం జరిగిందని తెలిపారు. గిరిజన గ్రామాలలో గుట్కాలు, మద్యపానం నిషేధించే విధంగా సహకరించాలని ప్రజలను కోరారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు మ-రువలేనివని, ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని, వీటిని భావితరాలకు గుర్తుండే విధంగా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా విద్య, వైద్యం, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా పి.వి.టి.జి గిరిజనులకు అందించడం జరుగుతుందని తెలిపారు.ఆదివాసీల సంప్రదాయ బద్ధమైన పూజలు, గుస్సాడీ నృత్యాలు, డోలు వాయిద్యాలతో కొమురం భీం ప్రాంగణం హోరెత్తింది.ఈ కార్యక్రమంలో ఎ. పి. ఓ.(పి.వి.టి.జి.) మెస్రం మనోహ, పేసా కోఆర్డినేటర్ వసంత్ రావు, సర్ మేడిలు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి జ్ఞాపకార్థం 500 మంది మహిళలకు చీరలు పంపిణీ

### బొల్లారం బిజెపి పట్టణ అధ్యక్షులు ఆనంద్ కృష్ణారెడ్డి



**పటాన్ చెరు (జిన్నారం), ఆగస్టు 9, సమయం న్యూస్ :** సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలో మున్సిపల్ బిజెపి పట్టణ అధ్యక్షుడు కేసీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి శనివారం తన తల్లి ఐదవ వర్ధంతి సందర్భంగా 500 మంది మహిళలకు మున్సిపాలిటీ సిబ్బందికి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి గారి జ్ఞాపకార్థం తన కూతురు సుదీక్ష రెడ్డి, కుమారుడు జయరాం రెడ్డి చేతుల మీదుగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలియజేశారు. తన తల్లి ఆత్మ శాంతి కలగాలని, వారి కలలు సహకారం కావాలని, వారి వర్ధంతి సందర్భంగా మహిళలందరికీ చీరల పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య.



**రాయపోల్,ఆగస్టు9:** గ్రామంలో భూమి కొనుగోలు చేసినప్పటికీ సదరు భూమి అమ్మిన వారు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మనస్తాపం చెంది ఓ రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మంతూర్ గ్రామంలో చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మంతూర్ గ్రామానికి చెందిన చెలిమెల మల్లేశం (49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తారు. అదే గ్రామానికి చెందిన రిమ్మనగూడ బొందవ్వ వద్ద 854 అ/2 , 855 సర్వే నెంబరులలో 2 ఎకరాల 12 గుంటల విస్తీర్ణం గల భూమిని 10 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా అట్టి భూమిని రిజిస్ట్రేషన్ చేయడంలేదు. ఇదే విషయం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడిచ్చినప్పటికీ కూడా బొందవ్వ వాళ్లు భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. ఈ భూమి తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకుండా తుప్పతి దుర్గయ్య , తుప్పతి స్వామి, కందూరి బుచ్చవ్వ ఈ ముగ్గురు వ్యక్తులు అడ్డుపడుతున్నారు.మల్లేశం ఇదే విషయం తరచూ కుటుంబ సభ్యులతో చెప్పుకుంటూ మదనపడుతుండేవాడు. ఇంకా ఎన్ని రోజులైనా అట్టి భూమి నాకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వరని తీవ్ర మనోవేదన చెంది శుక్రవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరులేని సమయంలో చెలిమెల మల్లేశం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వచ్చి 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మల్లేశం మృతి చెందారు. మృతుడి భార్య చెలిమెల లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ కుంచెం మానస పేర్కొన్నారు.

## వాహనదారులకు గుడ్‌న్యూస్.. ఇక టోల్ ఛార్జ్ రూ.15లే.. ఆగస్ట్ 15 నుంచి అమలు!

**శేరిలింగంపల్లి ఆగస్టు 9 సమయం న్యూస్. కే.బి రాజు.**

దేశంలోని వాహనదారులకు శుభవార్త తెలిపింది కేంద్రం. కేంద్ర రోడ్డు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ నిన్న జూన్ 18న ఒక కీలక ప్రకటన చేశారు. వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్ ప్రారంభం గురించి తెలియజేశ కొత్త పాస్ ప్రవేశపెట్టడం వల్ల ప్రైవేట్ వాహనదారులకు చాలా డబ్బు, సమయం ఆదా అవుతుంది. ఈ కొత్త ఫాస్ట్ ట్యాగ్ పాస్ ద్వారా డ్రైవర్లు కేవలం రూ. 15కే టోల్ ప్లాజాను దాటగలరని, ఇది ప్రస్తుత ఖర్చు కంటే చాలా తక్కువ అని గడ్కరీ అన్నారు.

**వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్ ధర రూ.3000..**

వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్ ప్రయోజనాలను వివరిస్తూ నితిన్ గడ్కరీ ఈ పాస్ ధర రూ.3 వేలుగా నిర్ణయించినట్లు చెప్పారు. దీనిలో వాహనదారులు 2 వందల ప్రయాణాలు చేయవచ్చని చెప్పారు. ఇక్కడ 'ఒక ప్రయాణం' అంటే ఒక టోల్ ప్లాజాను దాటడం. ఈ లెక్క ప్రకారం.. రూ.3000కి 200 టోల్‌లను దాటడం అంటే టోల్‌కు కేవలం రూ.15 మాత్రమే ఖర్చవుతుందని అన్నారు.

ఇది కూడా : రాఖీ పండగకి భగ్గుమన్న బంగారం ధరలు.. హైదరాబాద్‌లో తులం ధర ఎంతంటే..

సాధారణంగా, మీరు ఏదైనా టోల్ ప్లాజా గుండా ఒకసారి వెళ్ళడానికి సగటున రూ.50 చెల్లిస్తే, 200 టోల్ ప్లాజాలను దాటడానికి మీరు మొత్తం రూ.10,000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ వార్షిక పాస్‌ని ఉపయోగించడం ద్వారా మీరు నేరుగా రూ.7000 వరకు ఆదా చేయవచ్చు.

**వార్షిక పాస్ ప్రయోజనాలు:** కొత్త వార్షిక పాస్ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మీరు ప్రస్తుతం ఉపయోగిస్తున్న తరచుగా రీఛార్జ్ చేసుకోవాలి. అయితే వార్షిక పాస్‌ను సంవత్సరానికి ఒకసారి మాత్రమే రీఛార్జ్ చేసుకోవాలి. దాని చెల్లుబాటు గడువు ముగిసిన తర్వాత మీరు దానిని మళ్ళీ పునరుద్ధరించాలి. ఈ వార్షిక పాస్ జారీ చేసిన తర్వాత ప్రజలు టోల్ చెల్లించడానికి పొడవైన క్యూలలో నిలబడే ఇబ్బంది నుండి కూడా బయటపడతారు. ఇది చాలా సమయాన్ని ఆదా చేస్తుంది.ఈ వార్షిక ఫాస్ట్ ట్యాగ్ పాస్ ఆగస్టు 15, 2025 నుండి దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. అయితే ఇది జాతీయ రహదారులపై మాత్రమే చెల్లుతుంది. రాష్ట్ర రహదారులపై దీని ఉపయోగం చెల్లదు. ఈ చౌరవ రవాణాను మరింత సౌకర్యవంతంగా, ఆర్థికంగా మారుస్తుందని భావిస్తున్నారు.వార్షిక పాస్ కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి,ఆగస్టు 15 నుండి ఇప్పటికే ఉన్న వినియోగదారులు వార్షిక పాస్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి రాజ్‌మార్గ్ యాత్ర యాప్, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ (www.nhai.gov.in) లేదా www.morth.nic.in లను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు.




**ఇది తప్పనిసరియా?...** ప్రతి ఒక్కరూ FASTag వార్షిక పాస్ పొందడం తప్పనిసరి కాదా? ప్రతి ఒక్కరూ FASTag వార్షిక పాస్ పొందడం తప్పనిసరి కాదు. అయితే, రోజువారీ ప్రయాణికులు చెల్లించే టోల్ ఛార్జీలను తగ్గించడం దీని లక్ష్యం. వార్షిక పాస్ కొనడానికి ఇష్టపడని వారికి, వారి ప్రస్తుత FASTagయథాతథంగా పనిచేస్తుంది. టోల్ ప్లాజాలలో వర్తించే విధంగా వినియోగదారులు దీనిని సాధారణ లావాదేవీల కోసం ఉపయోగించాల్సి ఉంటుంది.

# ఘనంగా రాఖీ పండుగ వేడుకలు.





**రాయపోల్,ఆగస్టు9:** సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతల కు చిహ్నంగా నిలిచే రాఖీ పండుగను మండలంలోని ప్రజలంతా శనివారం ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట్లో సోదరి మణులు తమ సోదరులకు రాఖీలు కట్టి అప్యాయతను చాటారు. యువతులు, మహిళల సందడితో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. సోదరీమణులు పుట్ట మధుకు రాఖీ లు కట్టి స్వీట్లు తినిపించారు.

# పెన్షన్ దారుల మహా గర్జన సభను విజయవంతం చేయండి.

## పిలుపు ఇచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు

## తడ్కల్ కు మంద కృష్ణ మాదిగ రాక





**కంగ్టి,9ఆగస్టు,(సమయం న్యూస్):** కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ కు మంద కృష్ణ మాదిగ రాక......వృద్ధులు వితంతువులు మరియు వికలాంగుల పెన్షన్ పెంపుకై దేవి ఫంక్షన్ హాల్ తడ్కల్ లో 14 ఆగస్టున తడ్కల్ లో వికలాంగుల,మరియు చేయూత, పెన్షన్,దారుల మహాగర్జన సన్నాహక సదస్సు నారాయణఖేడ్ మరియు జహీరా బాద్, జుక్కల్, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పెన్షన్ దారులు, మాదిగ నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో రావాలని సంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జ్ రామవరపు శ్రీనివాస్ మాదిగ పిలుపు నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎంజేఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ మాదిగ,సంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ జంప్గి జాన్ మాదిగ,ఎమ్మార్పీఎస్ నారాయణఖేడ్ కన్వీనర్ అలిగే జీవన్ మాదిగ,ఎమ్మార్పీఎస్ తడ్కల్ క్లస్టర్ అధ్యక్షులు లాల్ కుమార్ మాదిగ, కోశాధికారి ఎర్రోళ్ల డేవిడ్ మాదిగ కార్యదర్శి గంగారాం మాదిగ,ఘనపూర్ ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల మనోహర్,జంప్గి(బి) ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి తుకారాం మాదిగ,ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సల్మాన్ మాదిగ,రాజు,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నకు రాఖీ.. కేటీఆర్ ఇంటికి కవిత.



**బంజారాహిల్స్ ఆగస్టు 9 సమయం న్యూస్. :** దేశ వ్యాప్తంగా రాఖీ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. తమ సోదరుల సుఖసంతోషాలను కాంక్షిస్తూ మహిళలు వారికి రాఖీలు కడుతున్నారు. అయితే.. రాఖీ పండుగకు పదిహేను రోజులు ముందు నుంచే తెలంగాణ రాజకీయాల్లో ఓ ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ సారి ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సోదరుడు కేటీఆర్ కు రాఖీ కడుతుందా? లేదా? అన్నది ఆ చర్చ సారాంశం. గత కొన్ని రోజులుగా కవిత బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఆ పార్టీలో దెయ్యాలు ఉన్నాయంటూ తీవ్ర వ్యాఖ్యలు కూడా చేశారు కవిత. తన తండ్రి కేసీఆర్ నాయకత్వాన్ని తప్పా.. ఇంకా మరెవరి నాయకత్వాన్ని ఒప్పుకునేది లేదంటూ అనేక సార్లు ఆమె స్పష్టం చేస్తున్నారు. తద్వారా కేటీఆర్ నాయకత్వాన్ని తాను అంగీకరించనని ఆమె తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు ఉన్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. దీంతో ప్రతీ సారి కేటీఆర్ ఇంటికి వెళ్లి రాఖీ కట్టే కవిత ఈ సారి కడుతుందా? లేదా? అన్న ఉత్కంఠ బీఆర్ఎస్ తో పాటు పొలిటికల్ సర్కిల్స్ లో నెలకొంది. అయితే.. తాను కేటీఆర్ కు తప్పకుండా రాఖీ కడతానని కవిత ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. దీంతో కవిత కేటీఆర్ ఇంటికి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ అంశంపై సోషల్ మీడియాలోనూ జోరుగా చర్చ సాగుతోంది. కవిత కేటీఆర్ కు రాఖీ కడుతుందని బీఆర్ఎస్ వర్గాలు పోస్టులు పెడుతున్నాయి.



ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో పాల్గొన్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా జిల్లా ఎస్పీ అఖిల్ మహల్

సమయం న్యూస్,బి ఆదిలాబాద్.



సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్..ఈరోజు శ్రీ జంగా రాఘవరెడ్డి స్టేట్ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గారికి రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని వారి నివాసంలో రాహత్ పర్వీన్ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి 11 డివిజన్ కాంటెస్టెడ్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి... శ్రీ జంగా రాఘవ రెడ్డి గారిని రాఖీ కట్టి అన్న చెల్లెల బంధుత్వానికి ప్రతిరూపం రక్షాబంధన్ అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అన్నా చెల్లెల అనుబంధం అని ఈ సందర్భంగా రాహత్ పర్వీన్ తెలిపారు. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి గారు మాట్లాడుతూ అన్న చెల్లెల బంధం నిదర్శనానికి మారుపేరు రాఖీ పండుగని తన నివాసానికి రాఖీ కట్టడానికి వచ్చిన ఆడపడుచులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అనుబంధాలకు రక్ష... ఆత్మీయత ను పెంచే గొప్ప పండుగ రాఖీ

## మానవ సంబంధాలను ఏకం చేసే గొప్ప పండుగ.

## మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్



**రాయపోల్,ఆగస్టు9,** సోదర సోదరీమణుల మధ్య ఆత్మీయతా అనుబంధం పెంచేది ఈ రాఖీ పండుగ అని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఆడపడుచులు ఫరూక్ హుస్సేన్ కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదరుడు, సోదరి మధ్యలో ఉన్న ప్రేమ, బాధ్యత అనుబంధాన్ని సూచించే గొప్ప పండుగే రాఖీ అని అన్నారు. తెలంగాణలో కుల మతాలకు అతీతంగా సోదర భావంతో జరుపుకునే పండుగల్లో ఇదొక గొప్ప పండుగ అని అన్నారు. ఈ పండుగ ద్వారా మానవ సంబంధాల గొప్పతనం గుర్తు వస్తుందన్నారు. బంధాలను అతికించే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని, దేవుడి దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తోడంగి సత్తమ్మ, బీఆర్ఎస్ నాయకులు చింతకింది మంజూర్,స్వామి, మహేశ్, అనీల్,మహిళా సోదరీమణులు చెప్యాలా సంతోష, చీరాల వెంకటమ్మ, చీరాల మానస, చింతకింది శ్యామల, చింతకింది అక్షయ, బెండ్ల లక్ష్మి, కాసుల వినోద, భాగ్యశ్రీ, నర్సవ్వ, దుడుక వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

## బిసి కాంగ్రెస్ నాయకులు బండారి గంగాధర్



**శివంపేట్ ఆగస్టు 8 ( సమయం న్యూస్ ) :** రాఖీ పండుగ సందర్భంగా మెదక్ జిల్లా శివంపేట్ మండల్ పిల్లుట్ల గ్రామంలో బి జి ఆర్ స్వగృహమున రాఖీ పండుగ ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిబిసి నాయకులు కాంగ్రెస్ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్ లి రాఖీ పండుగ అంటేనే అన్నాచెల్లెళ్ల అక్కా తమ్ముళ్ల అనురాగానికి ఆప్యాయతకు ప్రేమానురాగాలకు ప్రతీక దూరమైన బంధాలు ఎన్నో ఈరోజు అన్నా % చెల్లెలు.. అక్క % చెల్లెలు కలిసి ఆప్యాయతగా రాఖీ కట్టి జన్మజన్మలకు విడిపోని బంధం అని గుర్తు చేసేదే రాఖీ పండుగ...రాష్ట్ర ప్రజలందరికీ నియోజకవర్గ ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది...

# శ్రావణ పూర్ణిమ సందర్భంగా శ్రీ గురుపీఠంలో ప్రత్యేక పూజలు.!!




## శ్రీ గురు పీఠం చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్

**శివంపేట్ ఆగస్టు 8 ( సమయం న్యూస్ ) :**

శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలోని గురు పీఠంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో మరియు శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురు వెండి పాదాలకు విశిష్ట అభిషేకం అర్చన చేయడం జరిగింది. ఈ పూజలో అశేషమైన భక్తులు విచ్చేసి గురు దీవెనలు ఆశీస్సులు పొందారు. గురు పీఠమునకు వచ్చిన భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మల్టీవిటమిన్ టాబ్లెట్లతో లివర్‌కు ముప్పు!



ఈ కాలంలో ఆరోగ్యంపై ప్రజలలోని అవగాహన పెరిగినప్పటికీ కొన్ని పొరపాట్లు అనారోగ్యానికి దారితీస్తున్నాయి. ముఖ్యంగా మల్టీవిటమిన్ టాబ్లెట్స్ వాడకంలో అప్రమత్తత అవసరం. నేటి కాలంలో అధిక శాతం మంది వివిధ రకాల విటమిన్లు, ఖనిజాల లోపంతో బాధపడుతున్నారు. వైద్యులు మల్టీవిటమిన్లు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు, ఎందుకంటే ఇది ఈ లోపాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది. అయితే, ఈ మల్టీవిటమిన్లు వేర్వేరు వ్యక్తులను వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. శరీరానికి మంచివేనని భావించి వైద్యుల సలహా లేకుండానే రోజూ తీసుకుంటే కొన్నిసార్లు లివర్ పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంటుంది.

కొంతమందిలో, మల్టీవిటమిన్లు శరీరంలో తలెత్తిన విటమిన్, మినరల్స్ కొరత తీర్చడంలో సహాయపడతాయి. మరికొందరిలో ఇవి శరీరంలోని కొన్ని అవయవాలకు హాని కలిగించే ప్రమాదముంది. మల్టీవిటమిన్లు తీసుకోవడం వల్ల కొంతమందిలో కాలేయం దెబ్బతింటుంది. ఇవి కాలేయానికి హాని కలిగిస్తుందని సూచించే కొన్ని సంకేతాలు ఇక్కడ ఉన్నాయి.

**అలసట లేదా బలహీనత**

విపరీతమైన అలసట కాలేయ ఒత్తిడికి సంకేతం కావచ్చు. విటమిన్ ఎ, ఐరన్ లేదా నియాసిన్ అధికంగా ఉండటం వల్ల కాలేయం ఎక్కువగా పనిచేస్తుంది. అది శక్తి జీవక్రియను ప్రభావితం చేస్తుంది.

మూత్రం రంగు ముదురు గోధుమ రంగులోకి మారడం, మలం పాలిపోవడం పిత్త ప్రవాహంలో అంతరాయాన్ని సూచిస్తుంది. ఇది కాలేయ సమస్యలకు సంబంధించినది. విటమిన్ ఓవర్‌లోడ్ కారణంగా కాలేయ వాపు వల్ల ఇది సంభవించవచ్చు.

**వికారం, జీర్ణ సమస్యలు**

కొన్ని విటమిన్లు అధికంగా తీసుకోవడం వల్ల కాలేయం, జీర్ణాశయంలోని పేగులు చికాకు కలిగిస్తాయి. తద్వారా వికారం, ఉబ్బరం లేదా అజీర్ణం ఏర్పడతాయి. మల్టీవిటమిన్ వేసుకోవడం ప్రారంభించిన తర్వాత ఈ లక్షణాలు కనిపిస్తే కాలేయం ఒత్తిడికి లోనవుతున్నట్టేనని తెలుసుకోవాలి.

**దురద చర్మం (ప్రురిటస్)**

కాలేయం పనిచేయకపోవడం వల్ల చర్మం కింద పిత్త లవణాలు పేరుకుపోతాయి. ఇది నిరంతర దురదకు దారితీస్తుంది. అధిక మోతాదులో నియాసిన్, విటమిన్ ఎ లేదా ఐరన్ వంటి కాలేయ ఒత్తిడిని కలిగించే సప్లిమెంట్లను దీర్ఘకాలికంగా ఉపయోగించడం వల్ల సంభవించవచ్చు.

**కడుపు నొప్పి లేదా అసౌకర్యం**

కాలేయం ఉదరం పైభాగంలో కుడివైపున ఉంటుంది. ఆ ప్రాంతంలో నొప్పి లేదా కడుపు నిండిన భావన కాలేయ వాపుకు సంకేతం కావచ్చు.

**కామెర్లు**

కాలేయం దెబ్బతిన్నాయని గుర్తించేందుకు కామెర్లు స్పష్టమైన సంకేతం. ఇది రక్తంలో బిలిరుబిన్ పేరుకుపోవడం వల్ల వస్తుంది. కొన్ని మల్టీవిటమిన్లు, ముఖ్యంగా విటమిన్ ఎ, ఐరన్ లేదా మూలికా సారాలలో అధికంగా ఉండేవి కాలేయం విషపూరితం అయ్యేందుకు కారణం కావచ్చు.

**వివరించలేని గాయాలు లేదా రక్తస్రావం**

కాలేయం రక్తం గడ్డకట్టే కారకాల ఉత్పత్తికి సహాయపడుతుంది. అది దెబ్బతిన్నట్లయితే, మీకు సులభంగా గాయాలు లేదా ముక్కు నుండి రక్తం కారడం లేదా చిగుళ్ళ నుండి రక్తస్రావం జరగవచ్చు. విటమిన్ E అధిక మోతాదులో లేదా ఇతర పోషకాలతో సంకర్షణ చెందడం వల్ల కాలేయ పనితీరు దెబ్బతింటుంది.

## 45 ఏళ్లు దాటిన ప్రతి ఐదుగురిలో ఒకరికి మధుమేహం




భారత్‌లో మధుమేహం వేగంగా విస్తరిస్తోంది. 2019లో నిర్వహించిన ఒక అధ్యయనంలో 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు మధుమేహంతో జీవిస్తున్నట్టు గుర్తించారు. వారిలో కూడా ప్రతి ఐదుగురిలో ఇద్దరికి తమకు ఈ వ్యాధి ఉన్నట్టు తెలియదని ఈ అధ్యయనం పేర్కొంది. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. భారత్‌లో మధ్య వయస్కులు, వృద్ధుల్లో మధుమేహం కేసులు పెరుగుతున్నాయని ఈ అధ్యయనం పేర్కొంది. 2017-2019 మధ్య కాలంలో 45 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న 60 వేల మందిపై లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా (ఎల్ఏఎసఐ) ఒక సర్వే నిర్వహించింది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు ఎక్కువగా డయాబెటిస్ బారిన పడుతున్నట్టు గుర్తించింది.




# ఈ పండ్లు ఏమిటో..

## ఇవి అందించే లాభాలు ఏమిటో తెలిస్తే.. ఆశ్చర్యపోతారు..!



పండ్లు అంటే సాధారణంగా తియ్యగా ఉంటాయి. కొన్ని తియ్యగా ఉండకపోయినా చప్పగా లేదా పుల్లగా ఉంటాయి. అయితే మీకు తెలుసా..? ఇప్పుడు మేం చెప్పబోయే ఈ పండు మాత్రం చేదుగా ఉంటుంది. వాసన కూడా అంత నచ్చేదిగా ఉండదు. కానీ ఇది కూడా పండ్ల జాబితాకే చెందుతుంది. ఇంతకీ అదేం పండు అని అడగబోతున్నారా..? ఏమీ లేదండీ.. అదే.. నోని ఫ్రూట్. ఇది ఆకుపచ్చ-పసుపు రంగుల కలయికలో ఉంటుంది. ఆసియా, ఆస్ట్రేలియాలలో అనేక ప్రాంతాల్లో ఈ పండ్లను వాడుతుంటారు. ఇందులో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. కనుక దీంతో పలు ఔషధాలను కూడా తయారు చేస్తారు. ఈ పండ్లకు సుమారుగా 2వేల ఏళ్లకు పైగా చరిత్ర ఉందని చెబుతున్నారు. ఇది వాస్తవానికి పండే అయినా రుచి చేదుగా ఉంటుంది కనుక దీన్ని చాలా మంది జ్యూస్ రూపంలో తీసుకుంటారు. ఈ పండు మాత్రమే కాదు, దీని జ్యూస్ కూడా మనకు మార్కెట్‌లో లభిస్తుంది. దీన్ని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

**రోగ నిరోధక శక్తికి..**

నోని పండ్లలో ఫ్లేవనాయిడ్స్, లిగ్నన్స్, ఇరిడాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి, శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఈ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది కనుక వీటి జ్యూస్‌ను తాగితే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక వ్యవస్థను మెరుగ్గా పనిచేసేలా చేస్తాయి. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. రోగాలను తగ్గిస్తుంది. బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ ఇన్ఫెక్షన్ల నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

**ఆర్థరైటిస్ నొప్పులకు..**

నోని పండ్లలో సహజసిద్ధమైన యాంటీ ఇన్‌ఫ్లామేరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్స్‌గా వాడవచ్చు. ఈ పండ్ల జ్యూస్‌ను తాగుతుంటే నొప్పులు తగ్గుతాయి. వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. నోని పండ్లలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కీళ్లను ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. సర్వికల్ స్పాండిలైసిస్ అనే సమస్యతోపాటు ఆస్టియో ఆర్థరైటిస్ అనే సమస్య ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ఈ పండ్ల జ్యూస్‌ను రోజూ తాగితే కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. రక్త నాళాల వాపులు తగ్గిపోతాయి. దీంతో గుండె సంబంధ సమస్యలు రావు. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

**డయాబెటిస్ ఉన్నవారికి..**

నోని పండ్ల జ్యూస్ ను తాగితే షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. ఈ జ్యూస్‌ను తాగడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఇలా నోని పండ్ల జ్యూస్‌ను రోజూ సేవిస్తుంటే అనేక లాభాలను పొందవచ్చు. ఈ జ్యూస్‌ను తాగడం వల్ల కొందరికి అలర్జీలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు దీనికి దూరంగా ఉండాలి. నోని పండ్ల జ్యూస్ చేదుగా ఉంటుంది కనుక అందులో కొందరు చక్కెర లాంటివి కలిపి తాగుతారు. అలా తాగితే ఉపయోగం ఉండదు. నేరుగానే ఈ జ్యూస్‌ను సేవించాల్సి ఉంటుంది.

# పానిక్ అటాక్ అంటే ఏంటి?

## లక్షణాలు, నివారణకు చిట్కాలు ఇవే!

మనసు స్థిరంగా ఉండదు. క్షణానికో ఆలోచన మెదడును కుదిపేస్తుంది. ఊపిరి తీసుకునే వేగం పెరుగుతుంది. ఒక్కసారిగా గుండె దడదడలాడిపోతుంది. చనిపోతున్నామేమో అనే భయం. ఒకే సమయంలో ఇన్ని లక్షణాలు కనిపిస్తే అది పానిక్ అటాక్ కావచ్చు. ఇదీ సమస్య అనే అవగాహన లేక చాలామంది తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. మానసిక వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, పానిక్ అటాక్ జీవితాన్ని తారుమారు చేసే సమస్య. అయితే, దీన్ని సరైన సమయంలో గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా కంట్రోల్ చేయవచ్చు. ఈ సమస్యకు లక్షణాలు, కారణాలు, పరిష్కారాల గురించి ఈ కథనంలో..

**పానిక్ అటాక్ అంటే ఏమిటి?**

శరీరం కార్టిసాల్, అడ్రినలిన్ విడుదల విషయంలో గందరగోళానికి గురైతే పానిక్ అటాక్ దాడి చేస్తుంది. భయాందోళన లేదా అసౌకర్యం అకస్మాత్తుగా ఉప్పెనలా మనసుపై దాడి చేస్తాయి. నిమిషాల్లోనే గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. మీ శరీరం ఈ పరిస్థితితో పోరాడటమో లేదా పారిపోవడమో చేయాలని ప్రయత్నిస్తుంది. కానీ, కొన్నిసార్లు ప్రమాదం లేనప్పుడు కూడా, ప్రమాదం ఉన్నట్లుగా ప్రతిస్పందిస్తుంది.

**ఈ లక్షణాలుంటే పానిక్ అటాక్?**

- ఆందోళన, గాయం లేదా మానసిక రుగ్మతలు, వ్యక్తిగత లేదా కుటుంబ చరిత్ర
- అధిక ఒత్తిడితో కూడిన వాతావరణాలు. వృత్తిపరంగా లేదా వ్యక్తిగతంగా
- థైరాయిడ్ అసమతుల్యత లేదా రక్తంలో చక్కెర హెచ్చుతగ్గులు వంటి వైద్య పరిస్థితులు
- దీర్ఘకాలిక నిద్ర లేమి
- సోషల్ మీడియా, వార్తలు లేదా కెఫిన్ నుండి అతిగా తీసుకోవడం
- భయం కలిగినప్పుడు (ఆలోచించకండి, చర్య తీసుకోండి)
- సాధారణ లక్షణాలు:
- వేగవంతమైన హృదయ స్పందన లేదా దడ
- శ్వాస ఆడకపోవడం
- ఛాతీ నొప్పి లేదా ఒత్తిడి
- తలతిరగడం
- చేతులు లేదా ముఖంలో తిమ్మిరి లేదా జలదరింపు
- నియంత్రణ కోల్పోతామనే భయం లేదా చనిపోతామని భయం
- స్వీయ లేదా పరిసరాల నుంచి విడిపోయిన భావన
- శరీరం చెమటలు పెట్టడం లేదా వణుకు రావడం
- ఛాతిలో నొప్పి లేదా ఒత్తిడి
- అసలేం జరుగుతోందో అర్థం కాకపోవడం

**పానిక్ అటాక్ నియంత్రణకు చిట్కాలు:**

1. మెల్లగా ఊపిరి తీసుకోవాలి

వేగంగా ఊపిరి తీసుకోకుండా మెల్లగా శ్వాస తీసుకోవడం ద్వారా మనసు కాస్త స్థిరపడుతుంది. "4%-7-%8" టెక్నిక్ (4 సెకన్లు ఊపిరి తీసుకోవడం, 7 సెకన్లు ఆపడం, 8 సెకన్లు విడిచిపెట్టడం) అనుసరిస్తే వేగంగా కోలుకుంటాం.

2. గ్రౌండింగ్ టెక్నిక్

మీ దృష్టిని చుట్టూ ఉన్న వాతావరణం మీదకు మళ్లించండి. చూడగలిగే 5 వస్తువులు, వినగలిగే 4 శబ్దాలు, తాకగలిగే 3 వస్తువులు గుర్తించడం ద్వారా ఆలోచనలను మరోవైపు మరలించవచ్చు.

3. 'ఇది తాత్కాలికమే' అని అనుకోండి

పానిక్ అటాక్ శాశ్వతం కాదు. కొన్ని నిమిషాల్లో అది దానంతట అదే తగ్గిపో తుంది. అందుకే మీ శరీరం పై మీకు ని యంత్రణ ఉందనే నమ్మకం కలిగి ఉండండి.

4. తక్షణ దృష్టిమార్పు

ఇష్టపడే సంగీతం వినడం, నచ్చిన వ్యక్తితో మాట్లాడడం, చల్లని నీరు తాగడం వంటివి పానిక్ అటాక్ నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తాయి.

5. ప్రొఫెషనల్ సహాయం

పానిక్ అటాక్‌లు తరచూ వస్తే మానసిక వైద్య నిపుణుడి సహాయం తీసుకోవడం ఉత్తమం. సైకాలజికల్ కౌన్సిలింగ్, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ , అవసరమైన విధంగా మందులు ఉపయోగించవచ్చు.

6.కోల్డ్ వాటర్ షాక్

ముఖం మీద నీళ్లు చిలకరించండి లేదా ఐస్ క్యూబ్ పెట్టండి. ఇది శరీర వ్యవస్థను సాధారణ స్థితికి తెస్తుంది. మెదడును భయం నుంచి మళ్లించి యాక్టివేట్ చేస్తుంది.

7.నడక గదిలో అటూ ఇటూ నడిచినా పానిక్ అటాక్ నెమ్మదిస్తుంది. ఎందుకంటే శరీర కదలికలు అడ్రినలిన్ నియంత్రిస్తాయి. శరీరాన్ని ఫ్రీజ్ మోడ్ నుండి బయటకు తెస్తాయి.



# టీడీపీకి పట్టం కట్టేందుకు పులివెందుల ప్రజలు సిద్ధం

### జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ విజయం సాధిస్తుంది

### ధీమా వ్యక్తం చేసిన ఏపీ మంత్రి పార్థసారథి

**అమరావతి :** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని మంత్రి పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. పులివెందుల ప్రజల నుంచి టీడీపీకి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. వైసీపీ హయాంలో అంతులేని అవినీతి, అక్రమాలు జరిగాయని... దీంతో పులివెందుల ప్రజలు టీడీపీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పట్ల విజన్ కనిపించలేదని... బటన్ నొక్కాం, పని అయిపోయింది అనుకున్నారని పార్థసారథి ఎద్దేవా చేశారు. రైతు భరోసా ఇచ్చామని చెప్పి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించలేదని విమర్శించారు. జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా చెరువులు నింపలేకపోయారని ఎద్దేవా చేశారు. పులివెందులలో గృహ నిర్మాణం కూడా దారుణంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాయలసీమలో స్టీల్ ప్లాంట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని చెప్పారు.

# శ్రీవారి ఆలయంలో వైభవంగా ఉపాకర్మ సేవ



**తిరుమల :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిత్యం ఏదోఒకటి కైంకర్యం జరుగుతుంది. శని వారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో స్వామి వారికి ఉపాకర్మ సేవ వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు స్వామివారికి శ్రీ భూవరహస్వామివారి ఆలయంలో సంప్రదాయంగా యజ్ఞోపవీతాన్ని మార్చారు. శ్రీకృష్ణస్వామివారిని.. శ్రీ భూవరహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్చక స్వాముల వారు కలియుగ దేవుడు..తిరుమల శ్రీవెంటేశ్వరస్వామికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యజ్ఞోపవీతాన్ని సమర్పించి .. హారతి ఇచ్చి.. ఆస్థానం నిర్వహించి మరల ఊరేగింపుగా గోవింద నామ స్మరణతో శ్రీ కృష్ణ స్వామి వారిని తిరిగి ఆలయానికి చేరుకుంటూ .. భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పారుపత్తేదార్ హిమంతగిరి, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రాలయ ఉత్సవాలకు టిటిడి పట్టు వస్త్రాలు

**మంత్రాలయం :** తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పట్టు- వస్త్రాలు ఊరేగింపుతో రాఘవేంద్రస్వామి మఠం చేరుకున్నాయి. శనివారం రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా టిటిడి ఎఇఓ రామకృష్ణ తిరుమల తిరుపతి దేవస్థానాల నుండి శ్రీవారి వస్త్రాన్ని తీసుకువచ్చారు. శ్రీ మఠం అధికారులు,పండితుల వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన ఆర్చి మహాద్వారం వద్ద నుంచి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. మధ్వ కారిడార్ గుండా శ్రీ మఠానికి చేరుకున్న వారు గ్రామ దేవత శ్రీ మంచలమ్మకు చీరను అందజేసి విశేష పూజలతో సమర్పణతో మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీవారి వస్త్రాన్ని స్వామిజీకి అప్పగించారు. శ్రీ స్వామిజీ భక్తితో శ్రీ స్వామి వారి మూల బందావనం వద్ద వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం టీటీడీ అధికారులు శ్రీవారి శేషవస్త్రం, ప్రసాదాలను స్వామిజీకి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామిజీ శ్రీరామకృష్ణ ను అతని కుటుంబ సభ్యులకు ఆశీర్వదించారు, వారిని శేషవస్త్రం, మెమెంటో మరియు ఫల మంత్రాక్షతలు అందజేసి సత్కరించారు.

# గుంటూరు శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేత

**అమరావతి :** గుంటూరు నగరంలోని 70 ఏళ్ల పురాతన శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. 1958లో నిర్మించిన ఈ ఫ్లైఓవర్, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్ శాసనసభ నియోజకవర్గాలను అనుసంధానించే కీలకమైన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ . నగర విస్తరణ , పెరిగిన ట్రాఫిక్ ఒత్తిడి కారణంగా, ఈ పాత రెండు-లేన్ల బ్రిడ్జ్‌ను కూల్చివేసి, రూ. 98 కోట్లతో నాలుగు-లేన్ల కొత్త ROB నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టు గత 20 ఏళ్లుగా స్థానికుల డిమాండ్‌గా ఉంది. గుంటూరు ఎంపీ , కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ నిధులను రాబట్టడంలో కీలక పాత్ర పోషించారు. 1958 ఆగస్టు 8న అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఈ ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన చేశారు. ఇది గత 65 ఏళ్లకు పైగా సేవలు అందించింది. ఈ వంతెన డిజైన్ లైఫ్‌టైమ్ 50 ఏళ్లు మాత్రమే. రోజుకు 90,000 వాహనాలు ఈ బ్రిడ్జ్‌పై ప్రయాణిస్తాయని అంచనా. బ్రిడ్జ్ వయసు, పెరిగిన ట్రాఫిక్ ఒత్తిడి కారణంగా నిర్మాణం బలహీనపడింది, ట్రాఫిక్ జామ్‌లు సర్వసాధారణవ-ంయ్యాయి. కేంద్ర ప్రభుత్వం రూ. 98 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొదట ఆరు-లేన్ల ROB నిర్మించాలని ప్లాన్ చేశారు కానీ ఆస్తుల నష్టాన్ని తగ్గించేందుకు నాలుగు-లేన్ల ROBగా డిజైన్ ఖరారు చేశారు. ఫ్లైఓవర్ ఎత్తు 8 మీటర్ల నుండి 11.5 మీటర్లకు పెంచారు. పొడవు 1.5 కి.మీ నుండి 930 మీటర్లకు కుదించారు. డిజైన్‌లు ఏప్రిల్ 2025లో ఖరారయ్యాయి. ప్రాజెక్టు పూర్తికి 12-16 నెలలు పట్టవచ్చని భావిస్తున్నారు. మొదట నిర్మాణం పూర్తి చేసి, తర్వాత రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మిస్తారు.

కేంద్ర ప్రభుత్వం రూ. 98 కోట్లను సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద మంజూరు చేసింది, ఇది ఆంధ్రప్రదేశ్‌లో 13 రోడ్ ప్రాజెక్టుల కోసం మొత్తం రూ. 400 కోట్లలో భాగం. ఫ్లైఓవర్ విస్తరణ కోసం 134 ఆస్తుల్లో కొంత భాగం సేకరించారు. ఆస్తి యజమానులకు నష్టపరిహారంగా నాలుగు రెట్లు విలువైన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ బాండ్లు ఇస్తున్నారు. చాలా మంది యజమానులు సహకరించగా, కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఫ్లైఓవర్ కూల్చివేత కారణంగా గుంటూరు నగరంలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ట్రాఫిక్ పోలీసులు సూచించారు. గతంలో మూడు వంతెనల అండర్‌పాస్ విస్తరణ సమయంలో మూడు నెలల పాటు ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. వేగంగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. 70 ఏళ్లుగా గుంటూరు నగరంలో ఒక ఐకానిక్ నిర్మాణంగా ఉన్న శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేతతో, స్థానికులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. ఈ బ్రిడ్జ్ నగర చరిత్రలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచింది.

# మానవతా మూర్తి మండలి వెంకట కృష్ణారావు

### సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ

### ఎన్వీ రమణ దంపతులకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాషా వైభవ పురస్కారం ప్రదానం



**అవనిగడ్డ:** దివంగత మండలి వెంకట కృష్ణారావు మానవతా మూర్తి అని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ అన్నారు. శనివారం రాత్రి అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శత జయంతి, క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం పురస్కరించుకొని జస్టిస్ నూతలపాటి వెంకటరమణ దంపతులకు మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి "మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవం - 2025 " పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు నిజమైన గాంధేయవాది అన్నారు. ఆయన అనేక పదవులకు వన్నె తెచ్చారన్నారు. సమాజ సేవ కోసం అనుక్షణం తపించటమే కాకుండా ఆచరణలో పెట్టిన కృష్ణారావు స్ఫూర్తిని కొంతైనా ఆచరించాలని పిలుపునిచ్చారు. నేటి రాజకీయాల్లో డబ్బులు ఎంత ఖర్చు పెడితే అంత సంపాదించుకోవాలనే భావన తొలగిపోవాలన్నారు. నేటి యువతలో సామాజిక స్పృహ లేదని, కేవలం తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో విద్యావంతులు డబ్బులు సంపాదన ధ్యేయంగా జీవిస్తే, మరోవైపు ఉత్పన్నమయ్యే ఆకలి, నిరుద్యోగంతో శాంతి భద్రతల సమస్యలు, అరాచకాలు పెరిగితే సమాజంలో ప్రశాంత జీవితం సాధ్యమా అని ప్రశ్నించారు. మండలి వెంకట కృష్ణారావు ఎమ్మెల్యేగా, మంత్రి హోదాలోనూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే వారన్నారు. సమైక్య ఆంధ్ర వాదిగా పోరాడిన కృష్ణారావుపై రాళ్లు వేయాలని జై ఆంధ్ర ఉద్యమంలో ఆయన ప్రయాణించే బస్సు వద్దకు తాను మరికొందరు యువకులు వెళితే ఆయన తమను ఆలోచింప చేసిన ఘటన మరువలేనిది అన్నారు. దివిసీమ ఉప్పెన బాధితులకు సహాయం చేసేందుకు అవనిగడ్డ గాంధీ క్షేత్రం వస్తే, తమ కళ్ళ ఎదుట ఉప్పెన బాధితుల కష్టాలను తలచుకుని కృష్ణారావు ఆక్రోశిస్తున్న తీరు నేటికి తన కళ్ళ ముందు మెదులుతోందన్నారు. ఉప్పెన గ్రామాల్లో శవాల కుప్పలు చూసి చలించిన తాము కృష్ణారావు సూచనతో బాధితులకు వైద్య సహాయం అందచేశామని స్మరించుకున్నారు. నాడు నిస్సహాయ స్థితి నుంచి తనను తాను సముదాయించుకుని కోలుకున్న కృష్ణారావు బాధితులకు గాంధీ క్షేత్రంలో ఆశ్రయం ఇచ్చి వారిలో స్థైర్యం ధైర్యం నింపి, దాతల సహాయంతో దివిసీమ గ్రామాలు పునర్నిర్మించి దివిసీమకు పునరుజ్జీవం కలిగించారని స్మరించుకున్నారు. ప్రపంచ తెలుగు మహా సభల నిర్వహణ ద్వారా తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన కృషి అనితర సాధ్యం అన్నారు. గ్రంధాలయాల అభివృద్ధి, కళల పోషణతో పాటు, రాష్ట్రేతర తెలుగు సంఘాలను ఏకం చేసిన భాషా ప్రేమికుడు కృష్ణారావు అన్నారు. తండ్రి బాటలో నిరాడంబర జీవితం సాగిస్తున్న మండలి బుద్ధప్రసాద్ ఖచ్చితంగా నిర్ద్వందంగా డబ్బు రాజకీయాలకు వ్యతిరేకంగా ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ప్రజల గొంతు అసెంబ్లీలో చర్చకు పెట్టేందుకు బుద్ధప్రసాద్ లాంటి వాళ్ళు చట్ట సభలకు వెళ్ళటం తప్పనిసరి అన్నారు. బుద్ధప్రసాద్ లాంటి నాయకులు లేకపోతే ప్రజాస్వామ్యం బలహీన పడుతుందన్నారు. తెలుగు భాష కోసం తామిద్దరం కలిసి పని చేస్తున్నామని తెలిపారు. భాష జాతికి గుర్తింపు తెస్తుందన్నారు. తెలుగు వాడినని చెప్పుకోవటానికి గర్వకారణంగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవనం కోసం ఆంగ్లం నేర్చుకున్నా తెలుగు భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. మాతృ భాష పరిరక్షణ ఆవశ్యకత ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు విలువలు కలిగిన మనిషి అన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నతమైన ఆలోచనలతో రాజకీయాల్లో ఎదిగి పదవులు పొందటమే కాకుండా అవినీతి వ్యతిరేక ఉద్యమంతో మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తండ్రి బాటలో పయనిస్తూ నియోజకవర్గ అభివృద్ధి, తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సమాజాన్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చేందుకు యువత ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో చెడును తొలగించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో సామాన్యుడు డబ్బు లేకుండా గెలిచే పరిస్థితి రావాలన్నారు. కోటాను కోట్లు ఖర్చు పెట్టి చట్టసభల్లో అడుగు పెట్టే పరిస్థితి పోవాలన్నారు. కృష్ణారావు స్ఫూర్తి అందుకుని రాజకీయ నాయకులు నిరాడంబర జీవితంతో ముందుకు సాగాలనేదే శత జయంతి వేడుకల లక్ష్యం అన్నారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జీవీ పూర్ణచందు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు భవిరి రవి, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ గుడిసేవ విష్ణుప్రసాద్, దివిసీమ లలిత కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల వీరాంజనేయులు, కూనపరెడ్డి చంద్రశేఖర్ ప్రసంగించారు. తొలుత అతిధులను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ సత్కరించి స్వాగతం పలికారు. సభ ప్రారంభానికి ముందు అతిధులు మహాత్మా గాంధీ, మండలి వెంకట కృష్ణారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# స్ఫూర్తి నింపిన మండలి కృష్ణరాయ వైభవం సంగీత నృత్య రూపకం



**అవనిగడ్డ:** దివిసీమ గాంధీ తెలుగు తేజం మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం అవనిగడ్డ గాంధీ క్షేత్రం వేదికపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్ రచించిన "మండలి వెంకటకృష్ణ రాయ నృత్య రూపకం" ప్రదర్శన ఆసాంతం ఆకట్టుకుంది. దివిసీమ ఉప్పెన ఘట్టం విద్యార్థుల అభినయంతో అందరిని కంటతడి పెట్టించింది. ఇందులో మండలి వెంకట కృష్ణారావు వంశము, బాల్యము, చిన్నతనంలోని సత్యాగ్రహులకు పూలదండలు వేసి పోలీసులతో లాఠీ దెబ్బలు తినటం, అంచెలంచెలుగా ఎదిగి మంత్రి పదవి అలంకరించి ఆర్టీసీలో ప్రయాణం చేయటం, పూలదండలు వేసుకోనని ప్రతిజ్ఞ చేయడం, దివిసీమలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, దివిసీమ ఉన్నతికి కళాశాలలు, ఆర్టీసీ, ఫైర్ స్టేషన్, ఎదురు మొండి పంపింగ్ స్కీం, కోర్టులు, ఎల్ఐసి, కరెంటు, సముద్రపు కరకట్ట, ఆక్విడెక్టు పెంపు ఇత్యాది సమాజ సేవా కార్యక్రమాలు, ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం, తుఫానులో ప్రజలను ఆదుకొనటం పునర్నిర్మాణ కార్యక్రమం తదితర ప్రధాన ఘట్టాలతో కూడిన ఈ రూపకం ప్రదర్శించారు. కళా రత్న గాన కోకిల కుమారు సూర్యనారాయణ గానం, అవనిగడ్డ జానపద గాయకుడు రామకృష్ణ ప్రసాద్, పిరాటి అర్చనల

నృత్య దర్శకత్వంలో అద్భుతంగా ప్రదర్శించారు. గాంధీ క్షేత్రంలో క్విట్ ఇండియా సందర్భంగా జస్టిస్ నూతలపాటి వెంకటరమణకు మండలి వెంకట కృష్ణారావు పురస్కారాన్ని అందించే సందర్భంలో ఈ రూపకాన్ని అవనిగడ్డ విద్యానికేతన్ విద్యార్థులు, అర్చన నృత్యాలయ విద్యార్థులు కలసి 70 మంది ఈ ప్రదర్శనను అద్భుతంగా రక్తి కట్టించారు. మండలి వెంకట కృష్ణారావు జీవిత చరిత్ర ఘట్టాలు ఇందులో ప్రదర్శింపబడ్డాయి. ఇందులో ప్రముఖ కళాకారులు సూరగం రామకృష్ణ ప్రసాద్ మండలి వెంకట కృష్ణారావుగా, డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్ ఈ రూపక రచయిత వెంగళరావుగా అశ్వరావు పాలెం వైస్ ప్రెసిడెంట్ యక్కటి నాగరాజు భాట్టం శ్రీరామమూర్తిగా అద్భుతంగా నటించారు. ఈ సందర్భంగా వారందరినీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ ఘనంగా సత్కరించారు.

## ఓట్ల చోరీ ఆరోపణలపై అఫిడవిట్ ఏది?

### లిఖితపూర్వక రాహుల్ ఎందుకు ఇవ్వలేదు

### ఎన్నికల సంఘంపై రాహుల్‌కు నమ్మకంలేదు

### అలాంటప్పుడు పదవులకు రాజీనామా చేయండి

### బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా

**న్యూఢిల్లీ :** ఓట్ల చోరీ ఆరోపణలపై లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లిఖితపూర్వక అఫిడవిట్?ను ఇవ్వనందుకు బీజేపీ తీవ్రంగా విమర్శించింది. ఎన్నికల సంఘంపై రాహుల్? గాంధీకి నమ్మకం లేకపోతే తన పదవికి రాజీనామా చేయాలని పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈసీపై నమ్మకం లేకుంటే తమ పదవులకు రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అన్నారు. దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'రాహుల్ గాంధీ మీడియా ముందుకు వచ్చి నిరాధారమైన ఆరోపణలు చేస్తారు. కానీ రాజ్యాంగబద్ధమైన సంస్థ సాక్ష్యాలు, లిఖితపూర్వక ప్రకటన అడిగితే నిరాకరిస్తారు. అలాగే ఎన్నికల సంఘం నిజాయితీపై ఎలాంటి సందేహం లేదని, సంవత్సరాలుగా నిష్పక్షపాత సంస్థగా పేరు తెచ్చుకుందని సుప్రీం కోర్టు గమనించింది(గతంలోని సుప్రీం కోర్టు తీర్పులను ప్రకారం). రాహుల్ గాంధీ మీకు ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు వ్యాఖ్యలపై నమ్మకం లేకపోతే ఒక పని చేయండి. ముందుగా మీరు లోక్?సభ సభ్యత్వానికి రాజీనీమా చేయండి. ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ కూడా రాజీనామా చేయండి. ఎందుకంటే మీరు ఎన్నికల సంఘంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు' అని భాటియా అన్నారు.రాహుల్ గాంధీ ఓటు ఛోరీ వాదనను అబద్ధమని భాటియా అభివర్ణించారు. అశాంతికర శక్తి రాహుల్ ఇప్పుడు విధ్వంసకుడుగా మారాడని అన్నారు. ఆయన రాజ్యాంగాన్ని, భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈసీ అధికారులను బెదిరించడం ద్వారా రాజ్యాంగ సంస్థలపై యుద్ధం మొదలుపెట్టారని భాటియా విమర్శించారు. ఇక కాంగ్రెస్ పాలిత కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా రాజీనామా చేయాలని గౌరవ్ భాటియా అన్నారు. ఎందుకంటే వారి పార్టీ ప్రధాన నాయకులకు ఎన్నికల సంఘంపై నమ్మకం లేదని అన్నారు. మీకు అనుకూలంగా ఉంటే ఆమోదిస్తారు, అసౌకర్యంగా ఉంటే తిరస్కరించి ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తారని ఆరోపించారు. అలాంటివి పనిచేయవని అని అన్నారు.బిహార్? ఎన్నికల్లో ఓటమి భయంతోనే రాహుల్ గాంధీ ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ప్రతాప్?రావు జాదవ్ అన్నారు. సాంబా జిల్లాలో సిందూర్ మహా రక్తదాన్ అనే కార్యక్రమాన్ని జాదవ్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

ఆయన స్వయంగా తనను తానే ఇబ్బందుల్లోకి నెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలిచినప్పుడు ఈసీ ప్రశంసించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక ఆరోపణలు మొదలుపెట్టారు' అని జాధవ్ విమర్శించారు.

# టీమ్ఇండియా కెప్టెన్ ఇప్పటికే ప్రాక్టీస్ షురూ

## ఆసియా కప్‌కు సిద్ధమవుతోన్న టీమ్ఇండియా

2025 ఆసియా కప్ ఎడిషన్ సెప్టెంబర్ నెలలో ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9న ప్రారంభమై అదే నెల 28న ఫైనల్‌తో ముగుస్తుంది. ఈసారి భారత్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతోంది. అలాగే ఈ ఏడాది కూడా టైటిల్ లక్ష్యంగా బరిలో దిగనుంది. ఈసారి ఆసియా కప్ ప్రత్యేకంగా అలరించడానికి సిద్ధమవుతోంది. గతంలో ఈ టోర్నమెంట్‌లో కేవలం 6 జట్లే ఉండగా, ఈసారి మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. భారత్, పాకిస్థాన్‌తోపాటు, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, హాంకాంగ్, ఒమన్, యుఏఈ జట్లు పాల్గొంటున్నాయి. భారత్ టైటిల్ ఫేవరెట్‌గా ఉంది. అందుకు తగ్గట్లే టీమ్ఇండియా కెప్టెన్ ఇప్పటికే ప్రాక్టీస్ షురూ చేసేశాడు. టీమ్ఇండియాకు గుడ్‌న్యూస్. గాయం కారణంగా కొన్ని రోజులు ఆటకు దూరంగా ఉంటూ వస్తున్న, టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇటీవల విదేశాల్లో హెర్నియా సర్జరీ సక్సెస్‌ఫుల్‌గా చేయించుకున్నాడు. అయితే రికవరీకి టైమ్ పడుతుందని, దీంతో అతడు రానున్న ఆసియా కప్‌లో ఆడడం కష్టమని వార్తలు వచ్చాయి. తానీ, సూర్య ఆల్రెడీ గాయం నుంచి రికవరీ అయినట్లు తెలుస్తోంది. అంతేకాదు తాజాగా సూర్య తాజాగా నెట్స్‌లో ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు. దీంతో అతడు అతను ఆసియా కప్‌లో ఆడటం ఖాయంగా కనిపిస్తుంది. దీనికి సంబంధించిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టీమ్ఇండియాకు గుడ్ డేస్ అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. 2026 టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఆసియా కప్‌ను పొట్టి ఫార్మాట్‌లోనే నిర్వహించాలని ఆసియా క్రికెట్ కౌన్సిల్ నిర్ణయించింది. 2023లో వన్డే ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీ ఈసారి టీ20 ఫార్మాట్లో అలరించనుంది. దీంతో స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఇందులో ఆడే ఛాన్స్ లేదు. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 166 మ్యాచ్‌లు ఆడిన సూర్య 35 సగటుతో 4311 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 29 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇందులో 168 సిక్సర్లు కొట్టాడు. సూర్యకుమార్ యాదవ్ ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. దీని తర్వాత ఐపీఎల్‌లోనూ పాల్గొన్నాడు. ఈ టోర్నీలో భారత్ తొలి మ్యాచ్?లో సెప్టెంబర్ 10న ఆతిథ్య యూఏఈతో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌తోనే భారత్ జర్నీ ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్?కు దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికకానుంది. తర్వాత సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో హై వోల్టేజ్ మ్యాచ్ ఉంది. ఇక సెప్టెంబర్ 19న అబుదాబిలోని షేక్ జాయెద్ క్రికెట్ స్టేడియంలో ఒమన్‌తో మూడో మ్యాచ్ ఆడనుంది టీమ్ఇండియా.





## మళ్లీ మైదానంలోకి కోహ్లి!

టీమిండియా రన్ మెషీన్‌గా పేరు పొందిన విరాట్ కోహ్లి ఆస్ట్రేలియా పర్యటనకు ముందు తన శిక్షణను ప్రారంభించాడు. టెస్ట్, టీ20 క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లి కేవం వన్డే, ఐపీఎల్‌పై మాత్రమే దృష్టి సారిస్తున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనకు సన్నద్ధమయ్యే క్రమంలో కోహ్లి తన ప్రాక్టీస్‌ను లండన్‌లో మొదలుపెట్టాడు. గుజరాత్ టైటాన్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ నయీమ్ అమీన్ పర్యవేక్షణలు కోహ్లి ఈ శిక్షణ తీసుకున్నాడు. విరాట్ కోహ్లి తన శిక్షణా సెషన్‌కు సంబంధించిన ఒక ఫోటోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశాడు. ఆ పోస్టులో "సహాయం చేసినందుకు ధన్యవాదాలు బాయ్.. మిమ్మల్ని కలవడం ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది." అంటూ నయీమ్ అమీన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. అమీన్ కూడా కోహ్లి పోస్ట్‌ను తన అకౌంట్‌లో రీ-షేర్ చేస్తూ.. "మిమ్మల్ని కలిసినందుకు సంతోషంగా ఉంది, బ్రదర్! త్వరలో మళ్లీ కలుద్దాం." అని పేర్కొన్నాడు. కోచ్ నయీమ్ అమీన్ బర్క్ షైర్, బకింగ్‌హామ్‌షైర్, లండన్‌లలో 'మైటీ విల్లో అకాడమీ'ని నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన సన్‌రైజర్స్ హైదరాబాద్ కోచింగ్ స్టాఫ్‌లో కూడా పనిచేశారు. విరాట్ కోహ్లితో పాటు భారత ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా గతంలో అమీన్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. కోహ్లి తన టెస్ట్, టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలికిన తర్వాత, ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్, ఐపీఎల్ మ్యాచ్‌లపైనే దృష్టి పెట్టాడు. ఇప్పటివరకు 302 వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో 14,181 పరుగులు సాధించాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2025 ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌పై 43 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడి, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తమ తొలి ట్రోఫీని గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. కోహ్లి ఆటను చూడాలని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే వారు అక్టోబర్ వరకు వేచి ఉండాల్సి ఉంటుంది. వాస్తవానికి భారత్ ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. కానీ బీసీసీఐ, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పరస్పర అంగీకారంతో ఈ సిరీస్‌ను సెప్టెంబర్ 2026 వరకు వాయిదా వేశారు. టెస్ట్, టీ20లకు దూరంగా ఉన్న విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అక్టోబర్‌లో ఆస్ట్రేలియాలో జరిగే వన్డే సిరీస్‌తో మళ్ళీ భారత జట్టులోకి రానున్నారు. ఈ సిరీస్ అక్టోబర్ 19, 23, 25 తేదీలలో పెర్త్ స్టేడియంలో ప్రారంభమవుతుంది.

## ఐపీఎల్ గడప తొక్కాలని ఏపీఎల్ ప్లేయర్లు తహతహ



తెలుగు గడ్డపై టీ20 ఫీవర్ ప్రారంభమైంది. ప్రతిష్టాత్మక ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నాలుగో ఎడిషన్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. అయితే ఈ సీజన్ పై క్రికెట్ ప్రేమికులే కాకుండా ఐపీఎల్ జట్ల స్కౌట్ల బాధ్యులు కూడా దృష్టి సారించారు. గత మూడు ఎడిషన్ల నుంచి బాగా ఆడిన కొంతమంది క్రికెటర్లు ఇప్పటికే ఐపీఎల్ కు ఎంపికయ్యారు. గతేడాది వేలంలో సత్యనారాయణ రాజును ముంబై ఇండియన్స్ కొనుగోలు చేయగా, పైలా అవినాశ్ ను పంజాబ్ కింగ్స్ దక్కించుకుంది. దీంతో ఈసారి సీజన్ లోనూ సత్తా చాటి, ఐపీఎల్ గడప తొక్కాలని ఏపీఎల్ ప్లేయర్లు తహతహ లాడుతున్నారు. ఈసారి ఐపీఎల్ స్కౌట్ల బృందాలు గమనించే వారిలో కింది ముగ్గురు పేసర్లు ఉంటారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. సత్తా చాటితే ఐపీఎల్ బెర్త్ దక్కించుకునే అవకాశముంది. భీమవరం బుల్స్ కు ప్రాతినిధ్యం వహించే హరి శంకర్ రెడ్డిపై చాలా ఎక్కువ ఫోకస్ ఉంది. రైట్ ఆర్మ్ పేసరైన ఈ ప్లేయర్ గత మూడు సీజన్ల నుంచి నిలకడగా రాణిస్తున్నాడు. ఇప్పటివరకు 17 గేమ్ లు ఆడిన ఈ ప్లేయర్.. 25 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతని బౌలింగ్ స్ట్రైక్ రేట్ కేవలం 14.9 కావడం విశేషం. ఆరంభంలోనే వికెట్లు తీయగల సామర్థ్యం హరి సొంతం. యార్కర్లు, లెగ్ కట్టర్లు, బ్యాక్ ఆఫ్ హేండ్ బంతులతో బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. గతంలో 2021లో సీఎస్కే బృందంలో తను ఉన్నా, అంతగా అవకాశం రాలేదు. అయితే ఈసారి సత్తా చాటి మరోసారి ఐపీఎల్ గడప తొక్కాలని భావిస్తున్నాడు. సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించే యెద్దల రెడ్డి ఆకట్టుకుంటున్నాడు. గతేడాది సీజన్ లో తను సూపర్ గా రాణించాడు. ఐదు గేమ్ ల్లోనే 9 వికెట్లు తీశాడు తన స్ట్రైక్ రేట్ 10.2 కావడం విశేషం. ఆట వివిధ దశల్లో భాగస్వామ్యాలు ఏర్పడకుండా, వికెట్లను తీయడం అతని ప్రతిభకు నిదర్శనం. 26 ఏళ్ల ఈ పేసర్.. ఈ సీజన్ లో సత్తా చాటి ఐపీఎల్ కాంట్రాక్టు గెలుచుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. అమరావతి రాయల్స్ తరపున ఆడుతున్న గవ్వల మల్లికార్జున గత సీజన్ లో తన స్పిన్ మంత్రంతో ఆకట్టుకున్నాడు. 21 ఏళ్ల ఈ స్పిన్నర్ గత సీజన్ లో 8 వికెట్లు తీశాడు. అది కూడా 6.5 ఎకానమీ రేటుతో కావడం విశేషం. మిడిలోవర్లలో తన బౌలింగ్ లో బ్యాటర్లను చికాకు పెడుతూ, భాగస్వామ్యాలను విడదీస్తాడు. ట్రెడిషనల్ స్పిన్నర్ అయిన మల్లికార్జున ఈ సీజన్ లో సత్తా చాటి ఐపీఎల్ గడప తొక్కాలని భావిస్తున్నాడు.

## గిల్ కొన్నిసార్లు అగ్రెసివ్ అయ్యాడు

**ఇంగ్లాండ్ సిరీస్‌లో గీత దాటాడు**

**టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్**

రోహిత్ శర్మ టెస్టుల నుంచి రిటైరైన తర్వాత టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ 25ఏళ్ల యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ పగ్గాలు అందించింది. అతడి నాయకత్వంలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన భారత్ అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-2తో సమం చేసుకొని పర్యటనను ఘనంగా ముగించుకుంది. ఈ పర్యటనలో గిల్ బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్సీలోనూ ఆకట్టుకున్నాడు. సంప్రదాయ టెస్టు ఫార్మాట్‌లో జట్టును అగ్రెసివ్‌గా ముందుకు నడిపించాడు. పలుమార్లు తనను రెచ్చగొట్టిన ప్రత్యర్థులకు అదే రీతిలో జవాబిస్తూ, తాను ఏం తక్కువ కాదని గట్టి రిప్లై ఇచ్చాడు. అలాగే కీలక ఆటగాళ్లు గాయాల పాలైనా, అందుబాటులో ఉన్న ప్లేయర్లతో జట్టను సమర్థంగా నడింపిచి కెప్టెన్సీలోనూ మాజీల ప్రశంసలు అందుకున్నాడు. ఈ సిరీస్‌లో కామెంటేటర్‌గా వ్యవహరించిన టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ కూడా శుభ్?మన్ కెప్టెన్సీని మెచ్చుకున్నాడు. కానీ, కొన్నిసార్లు గిల్ తన దూకుడుతో గీత దాటాడని అన్నాడు. "గిల్ కొన్నిసార్లు అగ్రెసివ్ అయ్యాడు. అప్పుడప్పుడు అతడు హద్దు మీరాడు కూడా. అయితే ఈ విధానాన్ని గిల్ కొంతవరకు మార్చుకుంటాడేమో. కానీ, పూర్తిగా మారడు. ముఖ్యంగా కెప్టెన్?గా గిల్ ఇంగ్లీష్ మీడియాను హ్యాండిల్ చేసిన విధానం అద్భుతం. చాలా బాగా మాట్లాడాడు" అని కార్తిక్ అన్నాడు. అలాగే ఈ సిరీస్‌కు వచ్చేనాటికి గిల్ టెస్టు యావరేజ్ 30ల్లోనే ఉంది. దీంతో జట్టులో అతడి స్థానంపైనా విమర్శలు వచ్చాయి. కానీ ఇంగ్లాండ్ పర్యటనలో శుభ్‌మన్ గిల్ టాప్ స్కోరర్?గా నిలిచాడు. 10 ఇన్నింగ్స్?ల్లో 75.40 యావరేజ్?తో 754 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అయితే ఈ పర్యటనకు అతడు బాగా ప్రిపేరయ్యే వచ్చాడని కార్తిక్ అన్నాడు. "ఈ సిరీస్ ప్రారంభం కాకముందు, ప్రెస్‌మీట్‌లో గిల్ చెప్పిన మాట గుర్తుందా ఈ సిరీస్‌లో ఇరుజట్లలో తానే టాప్ స్కోరర్‌గా ఉండాలని ఆశించాడు. అంటే ఎంత కాన్ఫిడెంట్ ఉండాలి అలా చెప్పడానికి. అందుకే ఈ సిరీస్?కు అకడు ముందే బాగా ప్రిపేరై వచ్చాడు. తన బ్యాటింగ్ స్కిల్స్ మెరుగుపర్చుకున్నాడు. తనకు ఎదురుగా వచ్చే బంతికి ఎలా కౌంటర్ ఇవ్వాలో నేర్చుకున్నాడు" అని కార్తిక్ వ్యాఖ్యానించాడు. ఈ పర్యటనలో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన టెస్టులో గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అత్యుత్తమంగా బ్యాటింగ్ చేశాడు. తొలి ఇన్నింగ్స్?లో ఏకంగా డబుల్ సెంచరీ (269 పరుగులు) భారీ ఇన్నింగ్స్‌తో జట్టుకు మంచి స్కోర్ అందించాడు. అలాగే రెండో ఇన్నింగ్స్?లోనూ సెంచరీ (161 పరుగులు) చేసి రాణించాడు. ఈ మ్యాచ్‌లో గిల్ ఇన్నింగ్స్‌కు డీకే ఫిదా అయ్యాడట. పరుగులు చేయాలన్న ఆకలి, దృఢ సంకల్పం గిల్?లో ఉన్నట్లు దినేశ్‌కు కనిపించాయట. కాగా, ఈ టెస్టులో భారత్ 336 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. 2025- 27 వరల్డ్‌టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం 28 పాయింట్లు, 46.67 పాయింట్ పర్సెంటేజీతో మూడో స్థానంలో ఉంది. ప్రస్తుత సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడగా అందులో 2 విజయాలు, 2 ఓటములు ఉన్నాయి. మరో టెస్టు డ్రా చేసుకుంది. 100 శాతం పర్సెంటేజీతో ఆస్ట్రేలియా టాప్‌లో ఉండగా, శ్రీలంక 66.66 పాయింట్ పర్సెంటేజీతో రెండో ప్లేస్?లో కొనసాగుతోంది.




## సాయి సుదర్శన్‌పై అభిమన్యు తండ్రి తీవ్ర విమర్శలు

గత నాలుగేళ్లుగా భారత టెస్టు జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం లభించకపోవడంపై బెంగాల్ క్రికెటర్ అభిమన్యు ఈశ్వరన్ తండ్రి రంగనాథన్ ఈశ్వరన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ముగిసిన ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో జట్టులో చోటు దొరికినప్పటికీ తుది జట్టులో అవకాశం దక్కలేదు. అయితే సాయి సుదర్శన్‌కు అవకాశం కల్పించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడం క్రికెట్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. రంగనాథన్ ఈశ్వరన్ ఒక యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో టీమ్ సెలక్షన్ విధానాన్ని ప్రశ్నిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రంగనాథన్ ఈశ్వరన్ తన ఇంటర్వ్యూలో సాయి సుదర్శన్ ప్రదర్శనను గణాంకాలతో సహా విమర్శించారు. ఆయన మాట్లాడుతూ.. "మూడో స్థానంలో నా కొడుకుకు ఆడించి ఉండవచ్చు. సాయి సుదర్శన్‌పై నాకు వ్యక్తిగతంగా ఎలాంటి కోపం లేదు. కానీ అతను సాధించిన పరుగులు ఎన్ని? 0, 31, 0, 61... ఈ స్కోర్లకు బదులుగా, నా కొడుకు అభిమన్యుకు అవకాశం ఇచ్చి ఉండవచ్చు" అని అభిమన్యు తండ్రి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా తన కొడుకు అభిమన్యుకు ఉన్న అనుభవాన్ని ప్రస్తావించారు. "నా కొడుకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వంటి ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై 30% మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. ఎక్కువసేపు క్రీజులో నిలిచి ఇన్నింగ్స్‌ను నిర్మించగల ఆటగాడు అభిమన్యు అని అతని దేశవాళీ రికార్డులే చెబుతాయి" అని ఆయన ఘాటుగా వివరించారు. సాయి సుదర్శన్‌తో పాటు జట్టులో ఆడిన కరుణ్ నాయర్ ఎంపికను కూడా రంగనాథన్ ఈశ్వరన్ ప్రశ్నించారు. "కరుణ్ నాయర్ దేశవాళీ క్రికెట్‌లో ఎప్పుడూ 4 లేదా 5వ స్థానంలో ఆడేవాడు. అలాంటి ఆటగాడిని అకస్మాత్తుగా మూడో స్థానంలో ఎలా ఆడించారు? 4, 5వ స్థానాల్లో ఆడే ఆటగాళ్లందరూ టాప్ ఆర్డర్ బ్యాటర్లుగా మారిపోతున్నారు. కానీ నా కొడుకు ఒక స్పెషలిస్ట్ టాపార్డర్ బ్యాట్స్‌మెన్. అతను ఓపెనర్‌గా మాత్రమే ఆడగలడు" అని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. అయితే, భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ తన కొడుకుకు ఆశలు కల్పించినట్లు రంగనాథన్ ఈశ్వరన్ తెలిపారు. "గౌతమ్ గంభీర్ నా కొడుకుతో మాట్లాడుతూ, 'నువ్వు సరైన మార్గంలోనే ఉన్నావు. నీకు తప్పకుండా అవకాశం వస్తుంది. ఒకటి, రెండు మ్యాచ్‌లతోనే నేను నిన్ను జట్టు నుండి తొలగించే వ్యక్తిని కాదు. నీకు ఎక్కువ అవకాశాలు ఇస్తాను' అని హామీ ఇచ్చాడు" అని తెలిపారు. అభిమన్యు ఈశ్వరన్ దేశవాళీ క్రికెట్‌లో 103 మ్యాచ్‌లలో 48.70 సగటుతో 27 సెంచరీలు సహా మొత్తం 7841 పరుగులు సాధించాడు. తన కొడుకు 23 సంవత్సరాల కఠోర శ్రమకు తప్పకుండా ఫలితం లభిస్తుందని రంగనాథన్ ఈశ్వరన్ నమ్మకం వ్యక్తం చేశారు.




## మహేష్ అభిమానులకు కృతజ్ఞతలు

సూపర్‌స్టార్ మహేశ్ బాబు బర్త్‌డే సందర్భంగా ఆయన నటిస్తున్న ఎస్ఎస్ఎంబీ29 ప్రాజెక్ట్ నుంచి అప్‌డేట్ రాబోతున్నట్లు అందరూ ఎదురుచూసిన విషయం తెలిసిందే. అభిమానులు ఎదురుచూసినట్లే రాజమౌళి ఈ ప్రాజెక్ట్ నుంచి క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించాడు. ఈ సందర్భంగా ఒక పోస్టర్‌ని పంచుకున్నాడు. ఈ సందర్భంగా మూవీ లవర్స్‌ని, మహేశ్ బాబు అభిమానులను ఉద్దేశించి ఒక లెటర్‌ను విడుదల చేశాడు. సినీ ప్రియులకు, మహేష్ బాబు అభిమానులకు నమస్కారం. ఎస్ఎస్ఎంబీ29 ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభించి చాలా కాలం అయ్యింది. ఈ సినిమా గురించి తెలుసుకోవాలని మీరు చూపిస్తున్న ఆసక్తికి ధన్యవాదాలు. అయితే ఈ ప్రాజెక్ట్ భారీ స్థాయిలో తెరకెక్కబోతుంది కాబట్టి.. కేవలం కొన్ని ఫోటోలు లేదా ప్రెస్ మీట్లతో దీని గురించి పూర్తి వివరాలు చెప్పడం సాధ్యం కాదు. దీన్ని భారీఎత్తున రూపొందిస్తున్నాం. నవంబర్ 2025లో మహేశ్ లుక్‌ను విడుదల చేస్తాం. గతంలో ఎప్పుడూ చూడనివిధంగా ఈ చిత్రం ఉండబోతుంది. మీ సహనానికి ధన్యవాదాలు అంటూ రాజమౌళి రాసుకోచ్చాడు.






## చాన్సుల కోసం అందాల ఆరబోత

ఉప్పెన సినిమాతో మెగాస్టార్ మనసు దోచిన ఈ బ్యూటీ.. చిరు ఆన్ స్టేజ్ చెప్పినట్టు.. ఇండస్ట్రీలో ఎక్కడికో వెళ్లిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ చివరికి ఎక్కడికీ పోకుండా సినిమా అవకాశాలే లేకుండా.. మిగిలిపోయారు. వరుస ఫ్లాప్‌లతో సతమతమవుతూ.. మేకర్స్ వైపు అవకాశం కోసం ఆశగా చూసే వరకు పరిస్థితి తెచ్చుకున్నారు. అయితే ఇలాంటి ఈ సిట్యువేషన్‌లో.. కృతి షెట్టి ఓ ఫోటో షూట్‌తో కాస్త బోల్డ్ గా కనిపించారు. తాను హద్దులు దాటేందుకు రెడీ అన్నట్టుగా మేకర్స్ కు హింట్ ఇచ్చారు. ఆ ఫోటోలతో నెట్టింట కూడా తెగ వైరల్ అవుతున్నారు. కానీ అవే ఫోటోలతో మేకర్స్ మైండ్‌లో రిజిస్టర్ అయ్యారా? లేదా అనేది ఇక్కడ పాయింట్. పాన్ ఇండియా సినిమాలు.. మార్కెట్ అంచనాలు.. ప్రేక్షకుల నాడీని పట్టుకోడాలు.. ఓ సినిమా తెరకెక్కించేందుకు.. ఆ సినిమాలో ఆర్టిస్టులను క్యాస్ట్ చేసేందుకు... ఇలాంటి అంశాలనుపట్టుకునే మేకర్స్ ఇప్పుడు ఈమె బోల్డ్ ఫోటోలను చూసి ఛాన్స్ ఇస్తారా? లేక టూ లేట్ అంటూ.. లైట్ తీసుకుంటారా? అనేది ఇక్కడ పాయింట్. అయితే మేకర్స్ పాయింట్ ఆఫ్ వ్యూను పక్కక పెడితే.. ఇప్పుడు అందాలు ఆరబోసి ఏం లాభం అనేది నెటిజన్స్ కామెంట్. ప్రస్తుతం సోషల్ మీడియా ఖాతాలలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది ఈ వయ్యారి. ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. ప్రస్తుతం కృతికి తెలుగులో ఒక్క సినిమా ఛాన్స్ రావడం లేదు. కానీ తమిళం, మలయాళంలో మాత్రమే ఈ అమ్మడు అవకాశాలు అందుకుంటూ ఫుల్ బిజీగా ఉంటుంది. మరోవైపు నెట్టింట గ్లామర్ ఫోటోలతో రచ్చ చేస్తుంది.



## మాస్ రవితేజ టీజర్ వచ్చేసింది..

మాస్ మహారాజ కథానాయకుడు రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. నేడు రాఖీ పండుగా సందర్భంగా మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ టీజర్‌ను ఆగష్టు 11న ఉదయం 11.08 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.






## పూల చీరలో అందాల జాన్వీ

ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పటి నుంచి సాలిడ్ కమర్షియల్ హిట్ లేకున్నా, మంచి బ్రేక్ పడకున్నా జాన్వీ కపూర్ వం-ుస సినిమా ఆఫర్లను దక్కించుకోవడంకు కారణం ఆమె అందం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇండస్ట్రీలో ఆమె అందంతో పాటు అభినయంతో ఆకట్టుకుంటుంది అనే పేరు ఉంది. కానీ హిట్ లేక పోవడంతో అభిమానులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో విడుదల కాబోతున్న పరమ్ సుందరి సినిమాతో జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో మొదటి కమర్షియల్ బ్రేక్ ను దక్కించుకోబోతుంది అనే నమ్మకంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో అందాల జాన్వీ కపూర్ రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా స్టార్ హీరోయిన్స్ కి తగ్గకుండా మంచి క్రేజ్ ను దక్కించుకుంటూ ఉంది. అందుకే జాన్వీ కపూర్ ఎప్పుడు ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతూ ఉంటాయి. ఇటీవలే జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన పరమ్ సుందరి సినిమా నుంచి భీగీ సారి రెయిన్ సాంగ్ వచ్చింది. ఆ పాటకు మంచి రెస్పాన్స్ దక్కింది. జాన్వీ కపూర్ ను మరింత అందంగా ఆపాటలో చూశాం అంటూ అభిమానులు, నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆ పాటలో చీర కట్టుతో జాన్వీ కపూర్ చూపు తిప్పనివ్వలేదు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనే విషయం మ-రోసారి నిరూపితం అయింది. మోడ్రన్ డ్రెస్‌ల్లోనే కాకుండా అందమైన చీర కట్టులోనూ జాన్వీ కపూర్ చాలా బాగుంటుందని, తడిచిన చీర అందాల్లో ఇంకాస్త ఎక్కువ అందంగానే జాన్వీ కపూర్ ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆ చీర కట్టు మర్చి పోకుండానే ఈసారి పూల చీరలో జాన్వీ కపూర్ కనిపించింది.

## నిహారిక ఎమోషనల్ పోస్ట్

మెగా డాటర్ నిహారిక కొణిదెలకు ఇది రాఖీ పౌర్ణమి సమ్ థింగ్ స్పెషల్. ఎందుకంటే ఆమెకు ఇది డబుల్ ట్రీట్ ను అందించిన రోజు. పెదనాన్న మెగా స్టార్ చిరంజీవి కొడుకు రామ్ చరణ్‌తోనూ, సొంత అన్న వరుణ్ తేజ్ (తోనూ నిహారిక ఫోటోలను పెడుతూ తన మనసులోని మాటలను ఎమోషనల్ గా పోస్ట్ చేసింది. ఈ రాఖీ పండగ తనకు మరింత ప్రేమను అందిస్తోందని నిహారిక పేర్కొంది. తనకు ఎల్లప్పుడు అన్నయ్య చెర్రీ, వరుణ్ ఇద్దరూ వన్ స్టాప్ సొల్యూషన్స్ అని మనసులో మాట చెప్పింది. ఆ అన్నలిద్దరికీ చెల్లిగా అనిపించుకోవడం గ్రేట్ గా ఉంటుందని నిహారిక పేర్కొంది. ఇక ఈ రక్షాబంధన్ రోజునే నిహారిక మరో గుడ్ న్యూస్ ను గుర్తు చేసుకుంది. సరిగ్గా ఏడాది క్రితం ఆగస్ట్ 9వ తేదీనే నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమా జనం ముందుకు వచ్చింది. అందరూ కొత్తవాళ్ళతో ఆమె నిర్మించిన ఈ సినిమా కమర్షియల్ గా సక్సెస్ కావడమే కాకుండా అవార్డుల పంటనూ పండించింది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన గద్దర్ అవార్డులలోనూ రెండింటిని ఈ సినిమా గెలుచుకుంది. ఉత్తమ జాతీయ సమైక్యత, మత సామరస్యం, సామాజిక అభ్యున్నతి చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అలానే ఉత్తమ నూతన చిత్ర దర్శకుడిగా యదువంశీ గద్దర్ అవార్డు ను అందుకున్నారు. రివార్డులు, అవార్డులు తన చిత్రానికి దక్కడంతో నిహానిక వెంటనే మరో సినిమాకు శ్రీకారం చుట్టింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# వ్యవసాయ రంగంలో కరీంనగర్ జిల్లాకు 2 జాతీయస్థాయి అవార్డులు కైవసం .

- వ్యవసాయ శాఖలో కలెక్టర్ కు
- మత్స్య సంపద అభివృద్ధిలో మత్స్య శాఖకు అవార్డులు



**కరీం నగర్ ఆగస్టు8( సమయం న్యూస్).:** వ్యవసాయ, మత్స్యశాఖ అభివృద్ధికి గాను జిల్లాలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు జాతీయస్థాయిలో రెండు అవార్డులు వచ్చాయి.

"ఇండో అగ్రి", "సస్టైనబిలిటీ మ్యాటర్స్" సంస్థల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన "సస్టైనబుల్ అగ్రికల్చర్ సమ్మిట్"లో ఈనెల 7న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తరపున జిల్లా అధికారులు ఈ అవార్డులు అందుకున్నారు. రైతు సంక్షేమం కోసం సుస్థిర వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఈ అవార్డు దక్కింది.( దేశవ్యాప్తంగా ఈ అవార్డుకు ఇద్దరు కలెక్టర్లు మాత్రమే ఎంపికయ్యారు. పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్ పూర్ కలెక్టర్, కరీంనగర్ కలెక్టర్)

మత్స్య సంపద అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కరీంనగర్ జిల్లాలో అవలంబిస్తున్న వివిధ పద్ధతులకు గాను జిల్లా మత్స్య శాఖకు మరో అవార్డు అందింది. వ్యవసాయ శాఖకు వచ్చిన అవార్డును జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రా కోఆర్డినేటర్ నీలం వెంకటేశ్వర్ రావు, మత్స్యశాఖకు వచ్చిన అవార్డును జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ విజయభారతి న్యూఢిల్లీలో జిల్లా కలెక్టర్ తరఫున అందుకున్నారు. సుస్థిర వ్యవసాయ విస్తరణ కోసం జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టి విజయవంతమైన కార్యక్రమాల్లో కొన్ని..

- ఎరువులకు ప్రత్యామ్నాయంగా జిల్లాలో 11652 హెక్టార్లలో పచ్చిరొట్ట సాగు. ఈ విధానం ద్వారా సుమారు 13 10 టన్నుల యూరియా ఆదా అయింది
- నేరుగా వరివిత్తే పద్ధతి ద్వారా జిల్లాలో సుమారు 27 వేల హెక్టార్లలో వరి సాగు. ఈ విధానం ద్వారా కూలీలకు కొరత అధికమించడంతోపాటు హెక్టారుకు పదివేల రూపాయలు రైతుకు ఆదా.
- నూతన వరి వంగడాల పరిచయం
- భూమిలో సహజంగా భాస్వరం కలిగించే జీవన ఎరువుల వినియోగం. 12640 హెక్టార్లలో ఈ పద్ధతి ద్వారా సాగు.
- ఈ సాయం వాట్సాప్ గ్రూప్ ద్వారా రైతులకు సంపూర్ణ సమాచారం మత్స్య సంపద అభివృద్ధికి జిల్లాలో చేపడుతున్న కొన్ని చర్యలు..
- కరీంనగర్ జిల్లాలో చెరువులు కుంటలు జలాశయాల్లో మత్స్య సంపద అభివృద్ధి.
- ఇతర జిల్లాల్లోని ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలకు ఇక్కడి నుంచి సీడ్స్ ఎగుమతి
- మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు
- ఎం జి ఎన్ ఆర్ ఈజీఎస్ లో భాగంగా చేపల కొలనుల ఏర్పాటు.
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు చేప పిల్లల పెంపకంపై అవగాహన.

# నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఎస్కేప్ ఛానెల్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.





**నల్గొండ ఆగస్టు08( సమయం న్యూస్). :** నిరంతర వర్షాల దృష్ట్యా భారీ వర్షాలు వస్తే, అత్యవసర సమయంలో అప్రమత్తంగా ఉంటూ సాగునీటిని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె హాలియా 17 వ మైలు రాయి వద్ద, అలాగే 42 వ మైలు రాయి దేవులపల్లి వద్ద నాగార్జున సాగర్ ఎడమకాలువ ఎస్కేప్ ఛానెల్స్ ను పరిశీలించారు. అత్యవసర పరిస్థితులలో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,తక్షణమే నీటిని ఎస్కేప్ ఛానెల్ ద్వారా స్ట్రీమ్ కు పంపించాలన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతోత్సవం



**పటాన్ చెరు (జిన్నారం), ఆగస్టు 8, సమయం న్యూస్ :** సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారం లోని ప్రభుత్వ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కళింగ కృష్ణ కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కళాశాలలోని మొదటి సంవత్సరంలో 148 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్, స్థానిక తహసిల్దార్ దేవదాస్, స్థానిక ఎస్సై హనుమంతు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం, మొదటి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రధానం చేశారు. గతంలో కళాశాలలొ పనిచేసిప్రిన్సిపల్ గా పదోన్నతి పై వెళ్లిన కృష్ణారావు, ఐలయ్యలను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి వేడుకలు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండ సీఎంఆర్ఎఫ్

- రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే



**పటాన్ చెరు, ఆగస్టు 8, సమయం న్యూస్ :** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.జిన్నారం మండలం మాదారం గ్రామానికి చెందిన టి. స్వప్న గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో స్వప్న కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# 11 అక్రమ ఇసుక డంప్ సీజ్.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణా
- పాముల పేట, మేడిపల్లి ఇసుక రీచ్ మూసివేత
- అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు
- అక్రమ ఇసుక రవాణా పై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి , ఆగస్టు-08:( సమయం న్యూస్).:** జిల్లాలో 11 అక్రమంగా ఇసుక డంప్ లను సీజ్ చేసి మూసివేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం ప్రాంతంలో 5 ఇసుక డంప్ లు, మంథని ప్రాంతంలో 3 ఇసుక డంప్ లు, శ్రీరాం పూర్, రామగిరి, ధర్మారం మండలాల్లో ఒక్కో అక్రమ ఇసుక డంప్ మొత్తం 11 అక్రమ ఇసుక డంప్ లను గుర్తించి సీజ్ చేయడం జరిగిందని అన్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై సంబంధిత సెక్షన్లతో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడం జరిగిందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పాముల పేట మేడిపల్లి ఇసుక రీచ్ లను శాశ్వతంగా మూసి వేస్తున్నామని అన్నారు.జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కలెక్టర్ అక్రమార్కులను ఆ ప్రకటనలో హెచ్చరించారు.

# జిల్లాలోని విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచిన అధికారులు.




**నిర్మల్ ఆగస్టు8( సమయం న్యూస్). :** బాలశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాలన్న ఉద్దేశంతో, అధికారులు బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో 350 బ్యాంకు ఖాతాలు తెరిచి, విద్యార్థినులకు అందివ్వడం జరిగింది. ఇదివరకే సారంగాపూర్ మండలంలో ఎస్బిఐ, టిజిబి బ్యాంకుల సహకారంతో 500 ఖాతాలు తెరిపించినట్లు చెప్పారు.

# తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డెరెక్టర్ సెకండరీ హెల్త్‌గా అప్ గ్రేడ్ చేస్తాం

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా .





అసోసియేట్ ప్రొఫెసర్స్ నుండి ప్రొఫెసర్స్ గా పదోన్నతులు కల్పించినందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహా గారికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ల సంఘం ప్రతినిధులు .తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో 1690 డాక్టర్ పోస్టుల భర్తీ కీ సానుకూలంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా స్పందించారు .డాక్టర్ల పోస్టుల భర్తీకీ తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి దామోదర్ ఆదేశం.డాక్టర్ల ఉద్యోగాల భర్తీలో వయోపరిమితి పెంపు పై నిబంధనలు రూపొందించటానికి కమిటీ నీ నియమిస్తాం. మంత్రి దామోదర్ రాజనర్సింహా .

TVVP లో క్యాడర్ స్ట్రెంత్ పెంపు పై కమిషనర్ డా . అజయ్ కుమార్ తో చర్చించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా .TGGDA డాక్టర్ల సంఘం ప్రతినిధులతో సంగారెడ్డి లోని తన నివాసం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమావేశం . డాక్టర్ల సమస్యల పై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి పై మంత్రి దామోదర్ రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు

ఈ సమావేశం లో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ (TGGDA) అధ్యక్షులు డా . నరహరి , సెక్రెటరి జనరల్ డా . లాలు ప్రసాద్ , డా . రాహుఫ్ , డా . వినయ్ కుమార్ , డా . గోపాల్ , డా . క్రాంతి , డా . అశోక్ , డా . రామ్ సింగ్ లు పాల్గొన్నారు .



ఆరోగ్య పాఠశాల రెండవ విడత కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల సమీక్ష లో వివిధ అంశాల పై జిల్లాలోని 18 మండలాల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన తీరును పరిశీలించి స్టూడెంట్ చాంపియన్ లకు సర్టిఫికెట్ అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

సమయం న్యూస్‌బి ఆదిలాబాద్.